


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :240 | 25 శనివారం, జులై 2026 | పేజీలు : 08 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## జంతర్ మంతర్ ఆందోళనకు దూరంగా ఉండాలి...



- విద్యార్థులకు ఢిల్లీ యూనివర్సిటీ అడ్వయిజరీ జారీ
- యూనివర్సిటీల తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,జూలై24( ప్రజా వీక్షణం):

జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న సీజేపీ నిరసనలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఢిల్లీ విశ్వవిద్యాలయం జారీ చేసిన అడ్వైజరీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు.

...మిగతా 2 లో...

## ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం
- విద్యార్థుల భవిష్యత్ కోసమే తమ ఆందోళన
- కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి



న్యూఢిల్లీ,జూలై24( ప్రజా వీక్షణం):

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ...మిగతా 2 లో...

## విద్యార్థుల నిరసనలపై ప్రభుత్వ తీరు గర్హనీయం...

- మోడీ ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్ ఎంపి సోనియా
- వైఫల్యాలను ఏకరవు పెడుతూ ప్రకటన విడుదల



న్యూఢిల్లీ,జూలై24( ప్రజా వీక్షణం):

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు.

...మిగతా 2 లో...



## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

- వారందరికి కెటిఆర్ 2 కోట్ల చొప్పన చెల్లించాలి
- బర్త్‌డే రోజయినా అబద్దాలు మాట్లడకుండా ఉండలేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ పిసిసి చీఫ్

హైదరాబాద్,జూలై24( ప్రజా వీక్షణం):

బీఆర్‌ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్దాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు.

...మిగతా 2 లో...



## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం...

- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,జూలై24( ప్రజా వీక్షణం):

నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు.

...మిగతా 2 లో...

## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

- కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు

02





## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

న్యూఢిల్లీ,జూలై24( ప్రజా వీక్షణం):

లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమా రానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు..

...మిగతా 2 లో...




## కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస సంఘీభావం

- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ఇందిరాపార్క్ ధర్నాలో కెటిఆర్ డిమాండ్

హైదరాబాద్,జూలై24( ప్రజా వీక్షణం):

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్‌ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. ...మిగతా 2 లో...



## సిజెపి ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లు లేవు

- వాటిని విచారించకుండా తిరస్కరించారని ఎలా రాస్తారు
- మీడియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ,జూలై24( ప్రజా వీక్షణం):

'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా.. విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదని అన్నారు.

...మిగతా 2 లో...

## పిల్లలే మన భవిష్యత్ ఆస్తి...

పిల్లలు పుడితే భారం కాకుండా చేశాం

ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది

రంపచోడవరంలో తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భేటీలో సిఎం చంద్రబాబు




రంపచోడవరం,జూలై24( ప్రజా వీక్షణం):

పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగి ంచారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యా యులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు. పిల్లలందరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు. పిల్లలు పుడితే భారం కాదని.. ఆదాయంగా మార్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ. 10,120 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందికి రూ. 664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐఐటీలో ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు. పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు.. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తానని సీఎం చంద్రబాబుకు హామీ ఇచ్చానని.. అది తన ఒక్కడి వల్లే సాధ్యం కాదన్నారు. దీనికోసం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అనుసంధానం కావాలని చెప్పారు.

ప్రజావీక్షణం దినపత్రిక

# సంపాదకీయం

## బొద్దింకలను తేలికగా తీసుకోరాదు !

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఓక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వామ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

## కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస సంఘీభావం

మొదటిపేజీ తరువాయి

యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

మొదటిపేజీ తరువాయి

మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది.

## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

హైదరాబాద్,జూలై24( ప్రజా వీక్షణం): మొదటిపేజీ తరువాయి

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సిజెపి ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లు లేవు

మొదటిపేజీ తరువాయి

గత రెండు రోజులుగా మీడియా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సీజేఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సీజేపీ ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణ చేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం అని సీజేఐ అన్నారు. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీం కోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీం కోర్టు అందుకు తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సీజేఐ హితవు పలికినట్లు రాసుకొచ్చాయి. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..' మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ అన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీం కోర్టు నిషేధం విధించింది.

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం...

మొదటిపేజీ తరువాయి

ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు.

## జంతర్ మంతర్ ఆందోళనకు దూరంగా ఉండాలి...

మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించడం అంగీకారయోగ్యం కాదని మండిపడ్డారు. విద్యార్థుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్న వారే భవిష్యత్తులో జవాబుదారీగా నిలవాల్సి వస్తుందని రాహుల్ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించే హక్కు మీకెవరిచ్చారంటూ ప్రశ్నించారు. సమయం వచ్చినప్పుడు దీనికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఢిల్లీ వర్సిటీని ఎంపీ రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనల దృష్ట్యా ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులకు భద్రతా సూచనలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జంతర్‌మంతర్‌లో నిరసనలు కఠిన నియంత్రణలో ఉంటాయని పేర్కొంది. చట్టవిరుద్ధంగా నిర్వహించే సభలు, ఆందోళనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరించింది. అలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల వ్యక్తిగత భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు విద్యాభ్యాసం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలకు దూరంగా ఉండి, తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. సోషల్ మీడియాలో తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం విస్తృతంగా ప్రచారం అవుతోందని డీయూ పేర్కొంది. ఎలాంటి సమాచారాన్నైనా విశ్వసించి, ఇతరులతో పంచుకునే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని విద్యార్థులకు సూచించింది. ఈ క్రమంలో నీట్ లీక్‌పై సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతోన్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు యూనివర్సిటీలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతోన్న తప్పులను ప్రశ్నించడానికి..ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ స్పందించారు. విశ్వవిద్యాలయాలు ఇచ్చిన సర్క్యులర్‌పై పలువురు ప్రముఖులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. 'దిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా.. పార్లమెంట్ సభ్యుడిగా డీయూ విడుదల చేసిన ఈ ప్రకటనను ఖండిస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు. ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని ఎంపీ దీపేందర్ హుడా తెలిపారు. విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. మనకు నిజంగా వారి భవిష్యత్తుపై ఆందోళన ఉంటే.. మౌనంగా ఉండకుండా విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులకు మద్దతు ఇవ్వాలని నటి, చిత్రనిర్మాత పూజాభట్ అన్నారు.

## ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం

మొదటిపేజీ తరువాయి

విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై దిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో దిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.

## విద్యార్థుల నిరసనలపై ప్రభుత్వ తీరు గర్హనీయం...

మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోనియాగాంధీ ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు కేంద్ర మంత్రి బాధ్యత వహించకుండా పదవిలో ఇంకా కొనసాగుతున్నారని సోనియా గాంధీ ధ్వజమెత్తారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ప్రస్తావించారు. జాతీయ పరీక్షల నిర్వహణ వ్యవస్థలో లోపాలపై మోదీ ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ల చేతుల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణను ఉంచడం వల్లే ఈ పరీక్షల విశ్వసనీయత దెబ్బతిందని ఆరోపించారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని కూడా సోనియా గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతను దేశ భవిష్యత్తుగా చూడాల్సిందిపోయి దేశద్రోహులుగా చూస్తున్నారని ధ్వజమెత్తారు. జులై 20వ తేదీన విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యవేక్షణలోనే జరిగిందని ఆరోపించారు. అలాగే మోదీ హయాంలో పాఠశాల విద్యకు 50 శాతం, ఉన్నత విద్యకు 33 శాతం మేర బ్జడెట్ తగ్గించారని సోనియా గాంధీ దుయ్యబట్టారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో మోదీ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సోనియాగాంధీ ఆగ్రహించారు.

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

మొదటిపేజీ తరువాయి

'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

# శాకంబరీ దేవిగా విశ్వదుర్గేశ్వరి అమ్మవారి అలంకారం







## అమ్మవారికి ఘనంగా ఆషాఢం సారె సపర్పణ

### తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

తాడేపల్లిగూడెం ప్రతినిధి, జూలై 24 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డు విశ్వదుర్గేశ్వరి పేటలో కొలువైన శ్రీ విశ్వదుర్గేశ్వరి సమేత ఆనందేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ఆషాఢం సారె, శాకంబరీ దేవి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని శాకంబరీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సమస్త మానవాళికి శుభం కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు .కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్, తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, సీలి వెంకటాచలం, శ్రీరాముల విజయలక్ష్మి, కొల్లి రమావతి, ఎరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకోస్తున్న కూటమి ప్రభుత్వం





## బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు

### ఖాజీపాలెంలో ఘనంగా ' మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ 4.0

బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )

పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని శ్రీ మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0' కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ఆసక్తిగా వీక్షించి,పిల్లల ప్రతిభను అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే గారు విద్యార్థులకు స్వయంగా 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' వడ్డించారు.ఆ తర్వాత విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేస్తూ వారి చదువులు,పాఠశాల సౌకర్యాల గురించి ఆప్యాయంగా ముచ్చటిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.....గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ నేరుగా రంపచోడవరం ప్రభుత్వ హైస్కూలు ఉ జూనియర్ కళాశాలలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తల్లిదండ్రులకి తెలియజేయడంతో పాటు,పాఠశాలల అభివృద్ధి కోసం వారి సలహాలు,సూచనలు స్వీకరించాలనే దృఢ సంకల్పంతోనే ఈ మెగా పీటీఎం 4.0 ను ఏర్పాటు చేశామన్నారు.పిల్లల చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదనే ఉద్దేశంతో ఈ నెల 22వ తేదీన అర్హులైన ప్రతి తల్లి ఖాతాలో 'తల్లికి వందనం' పథకం నిధులను ప్రభుత్వం పారదర్శకంగా జమ చేసిందన్నారు.ఇందులో భాగంగా బాపట్ల నియోజకవర్గంలో 17,563 మంది తల్లుల ఖాతాల్లో రూ. 22,83,19,000 (ఇరవై రెండు కోట్ల ఎనబై మూడు లక్షల పంతొమ్మిది వేల రూపాయలు) జమ చేయడం జరిగిందని తెలిపారు.పిల్లల పెంపకం మరియు విద్యలో పురోగతి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదు,తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం.ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తూ,నాణ్యమైన ఉచిత విద్యను అందించడమే కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన ధ్యేయం." ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసేందుకు మోడల్ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చి, 'తరగతికి ఒక ఉపాధ్యాయుడు' అనే విధానం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గతంలో లాగా విద్యార్థుల వస్తువులపై ఏ రాజకీయ నాయకుడి ఫోటోలు వేయకుం డా,ఉపాధ్యాయ లోకానికే మార్గదర్శకుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి స్ఫూర్తితో "సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు" ను పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,ఆర్డీఓ హరికుమార్,పాఠశాల హెచ్ఎం ,ఉపాధ్యాయుల, సిబ్బంది,స్థానిక ప్రజాప్రతినిధులు ,కూటమి నాయకులు,విద్యా కమిటీ సభ్యులు,విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఖాజీపాలెం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..





దేవరకద్ర జులై 24 ప్రజా వీక్షణం

తెలంగాణ అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం నిరంతరం కృషి చేస్తున్న బి ఆర్ యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.మీ నాయకత్వం, అంకితభావం యువతకు స్ఫూర్తిగా నిలవాలని, సంపూ ర్ణ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని మన స్ఫూర్తిగా కోరుకుంటు,దేవరకద్ర మున్సిపాలిటీ బి ఆర్ యస్ పార్టీ నాయకులు మరియు యువ నాయకులు మాజీ మార్కెట్ చేర్మెన్ జెట్టి నర్సింహారెడ్డి, కేంగురి శ్రీకాంత్ యాదవ్, సత్యం సాగర్, మున్నూరు బాలరాజ్, చల్మా రెడ్డి, కొండా భాస్కర్ రెడ్డి, రాధ కృష్ణ, రాధ కొండల్, కురుమూర్తి, శాలి ఆంజనేయులు, నరేష్, కృష్ణ రెడ్డి, మైనారిటీ నాయకులు హస్నోద్దీన్, (అడ్డు )రెహమాన్, షేక్ అబ్దుల్ ఖాదర్, (జిల్లు )రబ్బానీ, తదితరులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు బ్రేడ్ లు మరియు పండ్లు పంపిణీ చేశారు.

# గుర్రం జాషువకి నివాళులు అర్పించిన తిరువీధుల శంకర్ ప్రసాద్

బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )

శుక్రవారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా బాపట్ల జిల్లా బాపట్ల పట్టణంలోని ఏబీఎం పాఠశాల వద్ద ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి యానాది హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షులు తిరువీధుల శంకర్ ప్రసాద్,బీసీ నాయకులు ఉప్పాల మురళి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# కౌకుంట్ల గ్రామ భద్రతకు మరో ముందడుగు..

దేవరకద్ర జులై 24 ప్రజా విక్షణం

దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో కౌకుంట్ల మండల కేంద్రంలో గ్రామ భద్రత, ప్రజల రక్షణ మరియు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో కౌకుంట్ల ఫ్రెండ్స్ ముందుకు వచ్చి తమ వంతు బాధ్యతగా ?40,000 రూపాయలతో 16 సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన సెటప్ బాక్స్ మరియు బస్టాండ్ ఆవరణలో 3 సీసీ కెమెరాలను శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది.కౌకుంట్ల సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్, అడిగిన వెంటనే స్పందించి,గ్రామ భద్రత కోసం ముందుకు వచ్చి సహకారం అందించిన వారి మిత్రబృందమైన కౌకుంట్ల ఫ్రెండ్స్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలో జరిగే ప్రతి కార్యకలాపంపై నిఘా ఉండటంతో పాటు, ప్రజలకు మరింత భద్రతా భావన కలుగుతుంది.గ్రామ అభివృద్ధి మరియు ప్రజల భద్రత కోసం చేపడుతున్న ఈ మంచి కార్యక్రమానికి మిగిలిన 13 సీసీకెమెరాల ఏర్పాటుకు గ్రామంలోని యువకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలని గ్రామ సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ గారు పిలుపునిచ్చారు. కౌకుంట్ల అభివృద్ధి కోసం యువత చూపిస్తున్న ఈ సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శం కావాలనీ కౌకుంట్ల యూత్ ఫ్రెండ్స్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# దేశ సాంఘిక,సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక,రాజకీయ అభివృద్ధికి మూలం విద్య

### డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి.

బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )

బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదేశాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని (మెగా పీటీఎం 4.0) శుక్రవారం పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ గ్లోరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.విద్య ద్వారా సామాజిక సాంఘిక ఆర్థిక సాంస్కృతిక రాజకీయ అభివృద్ధి తో పాటు శాస్త్ర, సాంకేతిక పరిశోధన రంగాలలో అభివృద్ధికి సాధ్యపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించి డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి కుమారి,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక


# నవతరం పార్టీ చీరాల మెగా మెడికల్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి..

రావు సుబ్రహ్మణ్యం,నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు.లి

**బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం ఈపురుపాలెంలో అపోలో మరియు ఎన్ ఆర్ ఐ ఆసుపత్రులు వారి వైద్య నిపుణులచే నవతరం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా మెడికల్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలని జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. చీరాల నియోజకవర్గం కన్వీనర్ దామర్ల ప్రకాష్ బాబు చొరవతో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరం ఆగస్టు తొమ్మిది 2026 న ఎస్ బి ఐ బ్యాంక్ వద్ద గల ప్రగడ కోటయ్య ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.షుగర్, బీపీ,చిన్న పిల్లలు చికిత్స,జనరల్ మెడిసిన్,కంటి ఆపరేషన్, ఎముకలు,కీళ్ళు వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.చీరాల నియోజకవర్గం పరిధిలో ఉన్న పేదలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు ఎంతో అవసరం.. ఎంపీడీవో అనురాధ..

**దేవరకద్ర జులై 24 ప్రజా వీక్షణం**

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు ఎంతో అవసరమని దానిని ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అనురాధ కోరారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో చిన్నచింతకుంట మండల పరిధిలోని బండర్ పల్లి గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మానవాళి మనుగడ కోసం మొక్కలు ఎంతో దోహద పడతాయని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా మొక్కలు నాడాలని ఆమె కోరారు. అలాగే ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మురళీకృష్ణ, సర్పంచ్ సుజాత వెంకటేష్, ఉప సర్పంచ్ ఆంజనేయులు, కార్యదర్శి శివకుమార్, డాక్టర్ జానకి రాము, నారాయణ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

**బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం మండలం పాతురు లో ఉంటున్న ఒక నిరుపేద కుటుంబానికి శుక్రవారం ఫౌండేషన్ ప్రెసిడెంట్ పఠాన్ అహ్మద్ బాష 10 కేజీల బియ్యంను అందజేశారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం,నిత్యావసర సరుకులు,దుప్పట్లు,అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందన్నారు. దాతలు,సభ్యుల సహకారంతో క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ షేక్ సుభాని,మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ బాష ,షేక్ బహదూర్ భాష,షేక్ బాజీ ఆర్మీ రిటైర్డ్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు,రేపు బాపట్ల జిల్లాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటన

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి., ఐ. ఏ.ఎస్.

**బాపట్ల:జూలై 24 ( ప్రజా వీక్షణం )**

ఆంధ్రప్రదేశ్ గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ జూలై 25,26 తేదీలలో ( శని,ఆదివారం ) బాపట్ల జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి,తెలిపారు.జూలై 25 (శనివారం) మధ్యాహ్నం 2.30 గంటలకు విజయవాడలోని లోక్ భవన్ నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి,సాయంత్రం 4.15 గంటలకు బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బి.వి.నాథ్ ఆడిటోరియంకు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 4.30 గంటల నుండి 5.30 గంటల వరకు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే 58వ వార్షిక స్నాతకోత్సవం (కాన్వొకేషన్) కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.అనంతరం సాయంత్రం 5:40 గంటలకు బాపట్ల నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి, సాయంత్రం 6:00 గంటలకు బాపట్ల జిల్లా,చీరాల మండలం, వాడరేవు గ్రామంలోని ఐటీసీ అతిథి గృహంకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.జూలై 26 (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు ఐటీసీ అతిథి గృహం నుండి రోడ్డు మార్గంలో విజయవాడకు బయలుదేరి,మధ్యాహ్నం 12.15 గంటలకు విజయవాడలోని లోక్ భవన్‌కు చేరుకోవడంతో బాపట్ల జిల్లా పర్యటన ముగుస్తుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# నేడు ఆషాడశుద్ధ తొలి ఏకాదశి,శయన ఏకాదశి..

**దేవరకద్ర జులై 24 ప్రజా వీక్షణం**

హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి ఏకాదశి పండుగలకు ఆది. ఆషాడ శుద్ధ ఏకాదశిని..“తొలి ఏకాదశి” అంటారు. సంవత్సరం మొత్తం మీద వచ్చే 24 ఏకాదశులు(ప్రతీ నెల కృష్ణ పక్షంలో ఒకటి, శుక్ల పక్షంలో ఒకటి మొత్తంగా రెండు ఏకాదశులు వస్తాయి) ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఏకాదశి అంటే పదకొండు అని అర్థం. మనకు ఉన్నటువంటి ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు వీటిని పనిచేయించే అంతరేంద్రియం అయిన మనసు కలిపితే పదకొండు. ఈ పదకొండు ఏకోన్ముఖంగా పనిచేసే సమ యమే ఏకాదశి.

**తొలి ఏకాదశి విశిష్టత..**

ఆషాఢ మాస ఏకాదశి తొలి ఏకాదశిగా (ఆషాఢ శుద్ధ ఏకాదశిగా) జరుపుకుంటారు. దీనినే “శయన ఏకాదశి” “ప్రథమ ఏకాదశి” “హరివాసరం” అని కూడా అంటారు. ఈ రోజు నుంచీ శ్రీమహావిష్ణువు క్షీరాబ్ధి యందు శేషపాన్పు పైన శయనిస్తాడు. కనుక దీన్ని “శయన ఏకాదశి”అంటారు. నిజానికి ఒకరకంగా పరిశీలిస్తే, ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు (పంచ భూతాలు, సూర్య చంద్రులు, గ్రహాలు పరస్పర సంబంధాన్నీ, వాటి గమనాన్ని బట్టి) సంకేతంగా చెప్పుకోవచ్చు. ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుండి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కనిపిస్తాడు (సూర్యుడు దక్షిణం వైపుకు మరలినట్లు, ఈ రోజు నుంచి దక్షిణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది). అంతేగాక చాతుర్మాస్య వ్రతం కూడా ప్రారంభమౌతుంది. ఇదే రోజున గోపద్మ వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఈ రోజు మొదలుకొని, కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ధి ద్వాదశి వరకు ఆచరించవలెనని పురాణాలు చెబుతున్నాయి.

**తొలి ఏకాదశి జరుపుకొను విధానం , నియమాలు..**

మహిమాన్వితమైన ఈ ఏకాదశి పర్వదినాన వ్రతాన్ని ఆచరిస్తే సూర్యచంద్ర గ్రహణములలో భూమి దానాలిచ్చినంత, అశ్వమేధ యాగం చేసినంత, అరవై వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని ఏకాదశి వ్రత మహత్యాన్ని గురించి మన పురాణాలు చెబుతున్నాయి. మహాసాధ్వీ సతీ సక్కుభాయి ఈ వ్రతాన్నే ఆచరించి మోక్ష సిద్ధి పొందటం జరిగింది. వ్రతంలోని ప్రధాన నియమాలు..

**ఉపవాస ఫలితాలు..**

ఈ వ్రతాన్ని ఆచరించదలచినవారు దశమి నాడు రాత్రి నిరాహారులై ఉండి ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందుగా కాలకృత్యాలు తీర్చుకుని శ్రీహరిని పూజించాలి. ఆ రోజు మొత్తం ఉపవాసం ఉండాలి. అసత్యమాడరాదు. స్త్రీ సాంగత్యం పనికి రాదు. కాని పనులు, దుష్ట ఆలోచనలు చేయకూడదు. ఆ రోజు రాత్రంతా జాగరణ చేయాలి. మర్నాడు అనగా ద్వాదశి నాడు ఉదయాన్నే కాలకృత్యాదుల అనంతరం శ్రీహరిని పూజించి నైవేద్య తాంబూలాలు సమర్పించి భోజనం చేయాలి. అన్నదానం చేయడం చాలా మంచిది..

**ఏకాదశి వ్రతమాచరించేవారు ఇవి తినరాదు...**

ఆషాఢమాస తొలి ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే లేచి, శుచిగా స్నానమాచరించి, శ్రీహరి నిష్ఠ నియమాలతో పూజించాలి. పూజ గదిని శుభ్రం చేసుకుని విష్ణుమూర్తి ప్రతిమకు లేదా పటానికి పసుపు, కుంకుమలు పెట్టి పుష్పాలతో అలంకరించుకోవాలి. తర్వాత చక్కెర పొంగలిని నైవేద్యంగా పెట్టి కర్పూర హారతివ్వాలి.ఏకాదశి వ్రతమాచరించే వారు కాల్చి వండినవి, మాంసాహారం, పుచ్చకాయ, గుమ్మడి కాయ, చింతపండు, ఉసిరి, ఉలవలు, మినుములు తీసుకోకూడదు. అదేవిధంగా మంచంపై శయనించడం చేయకూడదని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఏకాదశి విశిష్టతను గురించి పద్మ పురాణంలో వివరించారు. అష్టకష్టాలతో



తల మునుకలౌతున్న మానవజాతిని ఉద్ధరించటానికి సాక్షాత్ శ్రీహరే ఈ ఏకాదశిని ఏర్పాటు చేసాడనీ, ఈ వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరించిన వారు సమస్త వ్యధల నుంచీ విముక్తి పొందగలరనీ, మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందనీ పద్మ పురాణంలో పేర్కొన్నారని చెప్తుంటారు.ఈరోజు నుండి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు ‘చాతుర్మాస్య వ్రతం’ అవలంబిస్తారు. శాకాహారులై ఉపవాస వ్రతం ఆచరించాలన్నది, ఈ చాతుర్మాస్య వ్రత నియమం. ఏకాదశినాడు ఉపవసించి, మర్నాడు పారణ చేసి, ప్రసాదం తీసుకొని వ్రతం ముగిస్తారు. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఏరువాక లాగే తొలి ఏకాదశిని వేడుక చేసుకుంటారు. అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని, పైరుకు ఏ రకమైన తెగుళ్ళు సోకకూడదని, ఇతరత్రా ఏ సమస్యలూ ఎదురవకూడదని దణ్ణం పెట్టుకుంటారు. తొలి ఏకాదశి పండుగ నాడు మొక్కజొన్న పేలాలను మెత్తటి పొడిగా దంచి, అందులో నూరిన బెల్లం కలిపి దేవుడికి నైవేద్యంగా సమర్పించి, ప్రసాదంగా తీసుకుంటారు. తొలి ఏకాదశినాడు ఈ పేలపిండిని తప్పకుండా తినాలని విశ్వసిస్తారు.

**తొలి ఏకాదశి రోజున శేషసాయిని పూజిస్తే..**

ప్రతినెలా వచ్చే ఏకాదశి రోజున శ్రీహరిని పూజిస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పండితులు అంటున్నారు. ఈ మాసంలోనే బోనాలు, పశుపూజ, శకట ఆరాధనలు చేస్తారు. ప్రాశస్త్యం. .ముఖ్యంగా ఆషాఢమాసం వచ్చే తొలి ఏకాదశి రోజున ఒంటి పూట భోంచేసి, శేషశాయి అయిన లక్ష్మీనారాయణ మూర్తిని స్తుతిస్తే కోటి పుణ్యాల ఫలం లభిస్తుందని విశ్వాసం. ఆషాఢమాసము శుక్లపక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలిఏకాదశిగా పరిగణిస్తారు. స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని ‘శయన ఏకాదశి’ అని కూడా అంటారు. సతీ సక్కుబాయి ఈ ‘శయన ఏకాదశి’ నాడే మోక్ష ప్రాప్తి పొందింది. తొలిఏకాదశి నాడు రోజంతా ఉపవాసం ఉండి, రాత్రికి జాగారం చేసి, మర్నాడు ద్వాదశినాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళనమవుతాయని నమ్మకం. ఆ రోజు యోగనిద్రకు ఉపక్రమించే విష్ణువు మళ్ళీ నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడంటారు. దానిని ‘ఉత్థాన ఏకాదశి’ అంటారు. ఆ తర్వాత రోజు వచ్చే ద్వాదశినే ‘క్షీరాబ్ధి ద్వాదశి’ అంటారు. ఈ నాలుగు నెలల కాలాన్నీ పవిత్రంగా పరిగణించి అందరూ చాతుర్మాస్యదీక్ష చేస్తారు.

# పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరం





## పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూలై 24 (ప్రజా వీక్షణం)**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. పట్టణంలోని నంద్యాల కృష్ణమూర్తి సవిత్రుపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, పరిశుభ్రత గురించి తెలియజేశారు. పిల్లల విద్యాభివృద్ధికి ఇంటి నుంచే ప్రోత్సాహం అందించాలని కోరారు. అనంతరం దాత నంద్యాల కృష్ణమూర్తి సహకారంతో పాఠశాల పై అంతస్తులో నిర్మించిన నూతన తరగతి గదులను ప్రారంభించారు. అదనపు తరగతి గదులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు చదువుకోవడానికి మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఈవో పిఎంకె జ్యోతి, వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూ ర్తి, భాజపా మండల ఇంచార్జ్ నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని వివ రించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్‌లు, వర్షా కాల పరిస్థితులపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్






**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ప్రభు త్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనుల పురోగతి, పనులు సకాలం లో పూర్తి, నాణ్యతా ప్రమా ణాల పాటింపు, యూనిఫా మ్ పంపిణీ ఏర్పాట్లతో పాటు వర్షాకాల పరిస్థితు లు, వ్యవసాయం, తాగు నీరు, విద్యుత్ తదితర మౌలిక సేవలపై సమీక్షించా రు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న కలెక్టరేట్ వీడియో కాన్ఫ రెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.

# ఢిల్లీలో నిరసనకారులపై పడిన ప్రతి లాఠీ దెబ్బకూ సమాధానం చెప్పేంతవరకు పోరాటం ఆగదు - ఎస్ఎఫ్ఐ హెచ్చరిక

### బాపట్ల పట్టణంలో అత్యంత విజయవంతంగా ముగిసిన విద్యా సంస్థల బంద్

**బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పేపర్ లీకేజ్ కుంభకోణం ,విద్యావ్యవస్థలో జరుగుతున్న తీవ్రమైన అక్రమాలు మరియు ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువజన నేతల పై జరిగిన పోలీసు లాఠీచార్జీని నిరసిస్తూ శుక్రవారం బాపట్ల పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ అత్యంత విజయవంతంగా ముగిసింది. బాపట్ల పట్టణంలోని విద్యార్థులు ,యువకులు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ మాట్లాడుతూ ,దేశంలోని కోట్ల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్షా పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల వల్ల తీవ్ర మనోవేదనకు గురై దేశవ్యాప్తంగా మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను గుర్తించి, ఒక్కో కుటుంబానికి నష్టపరిహారంగా కోటి రూపాయలు చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం లీకేజీలే కాకుండా, గ్రేస్ మార్కుల పేరుతో సాగిన దోపిడీ, అక్రమాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్న ప్రముఖ విద్యావేత్త సోనమ్ వాంగ్చుక్ ,సీజీపీ వ్యవస్థాపకులు అభిజిత్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి. ఆదర్శ్, సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ తదితరులపై జూలై 20న పోలీసులు అత్యంత క్రూరంగా లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం నిలదీస్తున్న నాయకులపై భౌతిక దాడికి పాల్పడి, వారిని అక్రమంగా అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఈ అమానుష దాడికి పాల్పడిన పోలీసు యంత్రాంగంపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .నరేంద్ర మోడీ పాలనలో దేశంలోని ఏ ఒక్క విద్యార్థి,యువకుడు కూడా ప్రశాంతంగా చదువుకునే, ఉద్యోగాలు వెతుక్కునే పరిస్థితి లేదని ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వరుస




ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దులు, నోటిఫికేషన్ల జాప్యంతో నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నా,బీజేపీ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా మౌనం వహించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విద్యావ్యవస్థను పూర్తిగా మార్చివేస్తూ,పేద,మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయాలని చూస్తున్న కుట్రలను ఎస్ఎఫ్ఐ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన అహంకార పూరిత వైఖరిని విడనాడి, విద్యార్థుల సమంజసమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యార్థి,యువజన సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకొని రాబోయే రోజుల్లో మరింత ఉద్ధృతమైన,తీవ్రమైన పోరాటాలు నిర్వహిస్తామని, ప్రభుత్వాలకు తగిన మూల్యం చెల్లిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో మరియు బంద్‌లో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్,నాయకులు కే. శరత్ ,ప్రసాద్,రమేష్ ,భాను, కిరణ్,భరత్,చింటూ,హరీన్ తదితర నాయకులతో పాటు వందలాది మంది విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ బంద్ విజయవంతం కావడానికి స్వచ్ఛందంగా సహకరించిన ప్రైవేటు,ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలకు ,విద్యార్థుల తల్లిదండ్రులకు,పట్టణ ప్రజలకు మరియు మద్దతు తెలిపిన వివిధ రాజకీయ పార్టీల,ప్రజా సంఘాల నాయకులకు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రత్యేకంగా విప్లవ అభినందనలు తెలిపారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి..

### పిడిఎసు యుజిల్లా ఉపాధ్యక్షులు కె.హర్షవర్ధన్..

**దేవరకద్ర జూలై 24 ప్రజా వి క్షణం**

నీట్ అక్రమాలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను దేవరకద్ర మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఎమ్మార్వో ఆఫీస్ మీదుగా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు . ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . బిజెపి ప్రభుత్వం విద్యార్థి నిరుద్యోగులపై నిరంకుశ పాలన అనుసరిస్తుందన్నారు ఎన్ టి ఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. పోలీసుల కాళ్లపై వేడుకున్న కనికరించని ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు ప్రశ్నించాలని . పరీక్షలు సక్రమంగా నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ ప్రశ్నిస్తున్న విద్యార్థులపై దాడి చేయడం బిజెపి ప్రభుత్వానికి చెల్లిందన్నారు. ప్రజాస్వామ్యం దేశంలో నిరసన తెలిపే ఉద్యమకారులపై అణచివేత సరికాదని ఢిల్లీ పోలీసుల నిరంకుశ వైఖరి నశించాలని అన్నారు. ఉద్యమాన్ని అణిచివేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ ప్రవీణ్ పవన్ అఖిల అనూష పావని నందిని తదితరులు పాల్గొన్నారు.




# ఉన్నత రంగాల్లో రాణించాలంటే పోటీ తత్త్వంతో కూడిన విద్యను అభ్యసించాలి







### ---కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులం విద్య
### --- విద్యార్థి స్థాయి నుంచే క్రమశిక్షణ కృషి పట్టుదల కలిగి ఉండాలి
### --- యువ పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలి
### ---పీటీమ్ సమావేశం లో ఆర్డీవో విద్యార్థులకు సూచన

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 24 (ప్రజా వీక్షణం)**

ఆధునిక పోటి ప్రపంచంలో ఉన్నతమైన విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలంటే పోటీ తత్వంతో కూడిన విద్యను అభ్యసించాలని తాడేపల్లిగూడెం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎం.సూర్యా రావు సూచించారు తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల.పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డిఓ సూర్యారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి ఉన్నతమైన ఆశయాలను కలిగి ఉండాలన్నారు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఆధునిక పోటీ ప్రపంచంలో ఉన్నతమైన విద్య, ఉద్యోగ అవకాశాలు సాధించాలంటే కృషి పట్టుదలతో క్రమశిక్షణ కలిగిన పోటీ తత్వంతో కూడిన విద్యను అభ్యసించా లని సూచించారు విద్యకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఎంచుకున్న రంగంలో రాణించేందుకు తల్లిదండ్రులు విద్యార్థులకు సహకరించాలని కోరారు, పాఠశాలల్లో విద్యతోపాటు విద్యార్థులు యువ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు శిక్షణ అందించాలన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక రంగంపై పట్టు సాదించటంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఉద్యోగ అవకాశా లు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. సొంతంగా పరిశ్రమలను ఏర్పాటుచేసే స్థాయికి ఎదిగి పదిమందికి జీవనోపాధి కల్పించాలని వివరించారు. ఎంఈఓ 2 పి.ఎం.కె.జ్యోతి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి విద్యను అభ్యసించాలన్నారు, పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని అన్ని సబ్జెక్టుల్లో నైపుణ్య అభివృద్ధిని పెంపొందించుకోవాలని సూచించారు పాఠశాల ప్రిన్సిపల్ భీమడోలు రాజారావు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉన్నత విద్యా ఉద్యోగ రంగాల్లో రాణించాలన్నదే తమ ఆశయమని తెలిపారు. సంకల్పంతోపాటు కృషి, పట్టుదల ఉంటే ప్రతి విద్యార్థి ఎంచుకున్న రంగంలో విజయం సాధించవచ్చన్నారు నైపుణ్యంతో కూడిన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులు కృషికి తల్లిదండ్రులు విద్యార్థులకు సహకరించాలని కోరారు అనంతరం ఆర్డిఓ సూర్యారావు,ఎంఈఓ 2 జ్యోతి, పూర్వ విద్యార్థులకు ఘనంగా ప్రిన్సిపల్ రాజారావు చేతుల మీదగా ఘనంగా సన్మానం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రతాప్, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు

## ఆది కురుమయ్య స్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం తవ్విన దుండగులు..

**దేవరకద్ర జులై 24 ప్రజా విక్షణం**

నియోజకవర్గ పరిధిలో కౌకుంట్ల మండలం శివారులోని పిల్లిగుండ్లలో వెలసిన ఆది కురుమయ్య స్వామి గుడిలో గుప్తనిధుల కోసం దుండగులు ఏకంగా గుడిని తవ్వారు. మూల విరాట్ తొలగించి విగ్రహం క్రింద గుడిలో సుమారు 12ఫీట్ల మేరకు తవ్వి ఒక ట్రాక్టర్ మట్టిని గుప్తనిధుల కోసం తోవ్విపోశారు. రానున్న శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఆలయ అలంకరణ నిమిత్తంవెళ్లగా ఈ విషయం బయటప డింది. విషయం తెలుసుకు న్న గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు.



## డెంగ్యూ నివారణ అందరి బాధ్యత!

### సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్ ఎ ప్రసాద్

### బొర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా 'అవగాహన సదస్సు'

**బొర్రంపాలెం జులై 24(ప్రజా వీక్షణం):**

పరిసరాల పరిశుభ్రత మరియు దోమల నివారణతోనే డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చని, డెంగ్యూ నివారణ అనేది సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్యాధికారి అంజిబాబు మరియు అధికారుల బృందం పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం బొర్రంపాలెం జడ్పీ హైస్కూల్ నందు నిర్వహించిన 'తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల 4.0 ఆత్మీయ సమావేశం' లో వైద్యాధికారి అంజిబాబు అధ్యక్షతన డెంగ్యూ జ్వరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు గండబోయిన శ్రీను, కంపసాని రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్. ఎ. ప్రసాద్ డెంగ్యూ జ్వరాల వ్యాప్తి, నివారణా చర్యలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ప్రాంగణాల్లో ఉపయోగం లేని పాత్రలు, టైర్లు మొదలైన వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. వారంలో ఒకరోజు తప్పనిసరిగా 'ఫ్రైడే డ్రై డే' పాటించాలని, నిద్రించే సమయాల్లో దోమతెరలను వాడడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. జ్వరం ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి, రక్తపరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని స్పష్టం చేశారు. డెంగ్యూ వ్యాధిలో 'డెంగ్యూ హెమరేజ్', 'డెంగ్యూ షాక్ సిండ్రోమ్' అనేవి అత్యంత ప్రమాదకరమైన రకాలని, కాబట్టి ప్రారంభ దశలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహ్మద్ అలీ, ఆరోగ్య విస్తరణ అధికారి బి. ఏడుకొండలు, హెల్త్ విజిటర్ కృష్ణవేణి, సబ్ యూనిట్ హెచ్.ఎ కె. శ్రీనివాసరావు తో పాటు ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రహదారిపై విరిగిపడ్డ కొండచరియలు

## కారుమీద పడడంతో 13 మంది దుర్మరణం

**సిమ్లా,జూలై24( ప్రజా వీక్షణం):**

హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లా గిరిజన ప్రాంతం పాంగిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కిలాడ్-ఉదయ్‌పూర్ రహదారిపై కడు నాలా సమీపంలో వెళ్తున్న టాటా సుమో వాహనంపై అకస్మాత్తుగా కొండ చరియలు విరిగిపడ్డాయి. భారీగా మట్టితో వాహనం పూర్తిగా కూరుకుపోవడంతో అక్కడికక్కడే 13 మంది మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు భర్మోర్-పాంగా ఎమ్మెల్యే డాక్టర్ జనక్ రాజ్ ధ్రువీకరించారు. ఘటన అనంతరం జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాల నేపథ్యంలో పర్వత ప్రాంతాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# రాజుపోతేపల్లి ఎంపి యూపీ పాఠశాలలో ఘనంగా 'పేరెంట్స్ - టీచర్స్ మీట్'

**ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి: ముసునూరి బాలస్వామి**

**పేద విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేస్తామని హామీ**

రాజుపోతేపల్లి, జూలై 24:(ప్రజా వీక్షణం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'పేరెంట్స్ - టీచర్స్ మీట్' కార్యక్రమం శుక్రవారం రాజుపోతేపల్లి గ్రామపంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాజుపోతేపల్లి తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిపాటి కనక దుర్గారావు గారి ఆధ్వర్యంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందించ డంతో పాటు పలు విద్యా సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీ.నర్సాపురం లైన్స్ క్లబ్ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు ముసునూరి బాలస్వామి మాట్లాడారు. "ప్రతి పిల్లాడు చదువుకోవాలి.. ప్రతి ఒక్కరూ బడికి రావాలనే ఉద్దేశ్యంతో మన ప్రభుత్వం కృషి చేస్తోంది. నిరుపేద కుటుంబాలకు విద్య భారం కాకూడదనే లక్ష్యంతో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి తల్లికి 'తల్లికి వందనం' పథకం కింద 13,000 రూపాయలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరిగింది." అని ముసునూరి బాలస్వామి, లైన్స్ క్లబ్ అధ్యక్షులు తెలిపారు. అంతేకాకుండా, విద్యాభివృద్ధికి తమ వంతు సహాయంగా ఒక కీలక ప్రకటన చేశారు. గ్రామంలోని నిరుపేద విద్యార్థులు ఎవరైనా పైచదువుల నిమిత్తం హైస్కూల్‌కు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతుంటే, లైన్స్ క్లబ్ తరపున వారికి ఉచితంగా సైకిళ్లను అందజేస్తానని ఆయన వేదికగా హామీ ఇచ్చారు. మన ఊరి బడికే మన పిల్లలు అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సకల వసతులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.



మన ఊరి పిల్లలు బయటి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా, మన ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని, తల్లిదండ్రులు ఆ దిశగా ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో: మాజీ జడ్పీటిసి సభ్యులు నల్లూరి చలపతి ,నాయకులు చిలకా బాలయ్య,నత్తా నాగరాజు ,అందుగుల గాంధీ,చిలకా సు బ్బు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ భేటీ గుంటూరు

**--నిజాంపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవే,ఎన్ హెచ్ -216 విస్తరణపై వినతిపత్రాల సమర్పణ**

బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )



లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీతో భేటీ అయ్యారు. బాపట్ల నియోజకవర్గంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిత్వ శాఖ మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎంపీ వినతిపత్రాలను సమర్పించారు. సమర్పించిన ప్రతిపాదనలు: గుంటూరు - నిజాంపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేగుంటూరు నుండి తీర ప్రాంతమైన నిజాంపట్నం వరకు నూతనంగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు త్వరగా మొదలు పెట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎన్ హెచ్ - 216 కత్తిపూడి -- ఒంగోలు కారిడార్ 4-లైన్ల విస్తరణ: ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో కీలకమైన జాతీయ రహదారి-216 (ఎన్ హెచ్ -216) లోని కత్తిపూడి -- ఒంగోలు కారిడార్‌ను 4-లైన్ల రహదారిగా విస్తరించాలని కోరారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి,ప్రమాదాలను నివారించి రహదారి భద్రతను పెంచడానికి ఈ విస్తరణ తక్షణ అవసరమని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టుల ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని,సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తెలియచేశారు.

# నీట్ పేపర్ లీకేజీపై సిర్పూర్‌లో శాంతియుత నిరసన..






**విద్యార్థులు, యువకులతో చెలగాటం ఆడొద్దు...**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 24(ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నీట్ పేపర్ లీకేజీ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్‌లో బుద్ధుని విగ్రహం ఎదుట విద్యార్థులు, నిరుద్యోగ యువకులు శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ శాఖ పట్టభద్రుడు దుర్గం. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, మహిళా విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందుకు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎన్నేళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కసారి కూడా మీడియా సమావేశం నిర్వహించలేదని, విద్యార్థుల ఉద్యమానికి భయపడి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించడం ఉద్యమ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన తప్పులను ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు అని, ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. "విద్యార్థులు, యువకులతో చెలగాటం ఆడొద్దు" అంటూ కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు,లాటి చార్జి చేసిన పోలీసుల పై కేసులు పెట్టాలని, చనిపోయిన విద్యార్థుల కు కోటి రూపా యలు ఇవ్వాలని డిమాండ్. విప్లవం వర్ధిల్లాలి.. జై భీమ్.. జై భారత్" ,మోదీ సర్కార్ చోర్ హై, ఇంకిలాబ్ జిందాబాద్, ధర్మేంద్ర ప్రధాన్ ఇస్తిపా దొ అంటూ




నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో విశాల్ తాడే యువత ఉద్యమాన్ని ఇలాగే ముందుకు నడుపు తాం ,అంటూ నినాదాలు చేశారు ఈ కార్యక్రమానికి మాజీ ఎం ఎల్ ఎ కోనేరు కోనప్ప సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమా నికి రాష్ట్ర మైనార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షకీల్, మాజీ ఎంపిటిసి దుర్గం విక్రం, మాజీ సర్పంచ్ కిషోర్ హుస్సేన్, వార్డు సభ్యుడు ఇఫ్ఫత్ హుస్సేన్, సీనియర్ నాయకుడు షేక్ చాంద్, సామాజికవేత్తలు హాజరై విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులకు మద్దతు తెలిపారు. మండలంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ పూర్తిగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

# తిరుమలదేవిపేట హైస్కూల్‌లో ఘనంగా 'మెగా పేరెంట్-టీచర్ సమావేశం'

**10వ తరగతి స్కూల్ టాపర్‌కు 5,000, మండల టాపర్‌కు 10,000 నజరానా ప్రకటించిన తోట లక్ష్మీనారాయణ**

**విద్యాకార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ జయబాబు, గ్రామ ప్రముఖులు**

తిరుమలదేవిపేట:జులై 24(ప్రజా వీక్షణం)

స్థానిక గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం "మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం" అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ పాల్గొని ప్రసంగిస్తూ, విద్యార్థుల విద్య, క్రమశిక్షణ మరియు వారి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే వారిద్దరూ సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం ప్రోత్సహించాలని, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ కూడా విజయానికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు లక్ష్మీనారాయణ ఒక తీపి కబురు అందించారు. రాబోయే 10వ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి 5,000 నగదు బహుమతి, అలాగే మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి 10,000 ప్రోత్సాహక బహుమతిగా అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ జయబాబు హాజరయ్యారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే సమాజంలో విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఉమ్మడి పాలమూరు జిల్లాలో జనసేన పార్టీ బలోపేతం కార్యక్రమం -- ఆగస్టు 1

దేవరకద్ర జూలై 24 ప్రజా వీక్షణం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, ఆగస్టు 1వ తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మెడ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నాము. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీకి చెందిన రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. కార్యక్రమంలో భాగంగా మహబూబ్నగర్ పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించి అనంతరం, అక్కడి నుంచి భారీ ర్యాలీ నిర్వహించబడుతుంది. ఈ ర్యాలీ ద్వారా పాలమూరు జిల్లాలో జనసేన పార్టీ తన ఉనికిని, ప్రజా బలం మరియు సేవా సంకల్పాన్ని ప్రజలకు చాటుతూ ముందుకు సాగనుంది. కార్యక్రమంలో. పార్లమెంట్ ఇంచార్జి మేడ రామకృష్ణ, వంగా లక్ష్మణ్ గౌడ్, పి ఆర్ రాఘవేందర్,ముకురాల కృష్ణ, మణికంఠ గౌడ్, రవీందర్ గౌడ్, శ్రీవాల్లి, భరధ్వాజ్, బాబు జాగ్జీవన్ (మైక్ ),డాక్టర్ వి వి చారి, ముత్యాల గౌరవ్,ఎద్దుల శ్రీనివాసులు, మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థులు,బాల్ రాజ్ యాదవ్, రవీందర్, కనక దుర్గ, నరేష్,రవి,రామ రాజు,కిషోర్ లాల్,శివ,జనసైనికులు వీరమహిళలు పాల్గొన్నారు.



# సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహానికి నూతన హాస్టల్ భవనం మంజూరు చేయాలి...కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం.దినకర్.





కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 24 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లో ని సాంఘిక సంక్షేమ వసతి గృహానికి నూతన హాస్టల్ భవనాన్ని మంజూరు చేసి విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం.దినకర్ అన్నారు. కె వి పి ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల యస్ సి హాస్టల్ ను సందర్శించి విద్యార్థులకు గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ వసతి గృహం నిర్మించి దాదాపుగా 50 సంవత్సరాలు అవుతుందని ఈ భవనం పూర్తిగా స్థితిల వస్తలో చేరుకుందని ఈ హాస్టల్ లో ఒకే తరగతి గది ఉండటం వలన ఆ గదిలో 90 మంది విద్యార్థులు ఇరుకున ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు ఆ వసతి గృహం పూర్తిగా స్థితిల వస్తలో చేరిపోయింది అంతే కాకుండా వర్షాకాలంలో వర్షం వస్తె తరగతి గదులు సైతం కురవడం వలన నిద్ర హారాలు మణి కూర్చుండి ఉండవలసి వస్తుందని 90 మంది విద్యార్థులకు 2 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉండటం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతూ కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తుందని అన్నారు,5 సంవత్సరాలుగా ట్రంక్ పెట్టెలు ఇవ్వలేదని విద్య సంవత్సరం ప్రారంభమై నెల రోజుకు గడుస్తున్న నేటి వరకు నోట్ బుక్ లు రాలేదని విద్యార్థులు చెప్పారు ఆట వస్తువులు సైతం లేవని మరుగుదొడ్లను మరమ్మత్తులు చేయాలని ప్రహరీ గోడ మంజూరు చేయాలని కోరారు కార్యక్రమంలో కె వి పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు. శ్యామ్. జిల్లా సహాయ కార్యదర్శి మహేష్. నాయకులు. సందీప్. విద్యార్థులు ఉన్నారు

# ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS

25 శనివారం, జులై 2026

www.prajaveekshanam.in



## మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో పాల్గొన్న పల్లం సరోజిని

**బాపట్ల : జూలై 24 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల మండలంలోని కొండుభొట్లవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ…పిల్లల భవిష్యత్తుకు పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మూడు కీలక స్తంభాలని,విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి తల్లిదండ్రి నిరంతరం పాఠశాలతో అనుసంధానంగా ఉండాలని సూచించారు. పిల్లల చదువు, క్రమశిక్షణ,నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న "తల్లికి వందనం" వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. అలాగే భారత మాజీ రాష్ట్రపతి,గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకుంటూ, ప్రతి విద్యార్థి తన గురువులను గౌరవించడంతో పాటు వారు బోధించే విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. గురువుల మార్గదర్శకత్వమే విద్యార్థుల విజయానికి పునాది అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం గురించి కూడా ఆమె వివరించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులో రాణించేందుకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని, తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యం,ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి,డిజిటల్ విద్య, ఆధునిక తరగతి గదులు, నాణ్యమైన బోధన,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆమె తెలిపారు. ఈ అవకాశాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండలు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చలమయ్య,టీడీపీ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్,రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## తెలంగాణ జలసిరిని ప్రజా ఉద్యమంలా చేపట్టాలి

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఎల్‌నినో ప్రభావం, నీటి ఎద్దడి పరిస్థితులను ఎదు ర్కొనేందుకు "తెలంగాణ జలసిరి" కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధి కారులను ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం ఫార్మ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, బోర్‌బావుల రీఛార్జ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీకి కాంటింజెన్సీ ప్రణాళిక రూపొందించి, తాగునీటి ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని, రైతులకు పంటల ఎంపిక, నీటి సంరక్షణపై విస్తృత అవ గాహన కల్పించాలని అధి కారులకు ఆదేశించారు



## మన ఊరు.. మన బాధ్యతకు యం.డి పాషా నిలువెత్తు నిదర్శనం...

### ప్రజాప్రతినిధులు,అధికారులకు యువకుడి సేవాభావం మౌన సందేశం..

**దేవరకద్ర ,జులై 24 ప్రజా వీక్షణం**



ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల బాధ్యత అయినప్పటికీ, వారు స్పందించే వరకు ఎదురుచూడకుండా గ్రామ ప్రయోజనాన్ని తన బాధ్యతగా భావించిన గ్రామ యువకు డు నూర్ మహమ్మద్ కుమారుడు యం.డి పాషా చేసిన సేవ గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటోంది. నియోజకవర్గ పరిధిలో కౌకుంట్ల మండల పరిధిలోని పేరూరు గ్రామంలో కమాన్ సమీపంలోని సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహ నదారులు నిత్యం ప్రమాదాలను ఎదుర్కొ ంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన పాషా ఎలాంటి ప్రచారం, రాజకీయ ప్రయో జనం లేదా ప్రతిఫలం ఆశించకుండా తాను సొంతంగా గుంతల్లో మట్టిని వేయించి రోడ్డును తాత్కాలికంగా సరిచేశారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులకు కొంతమేర ఉపశమనం లభించింది. ఈ ఘటన ఒకవైపు గ్రామ యువతకు సామాజిక బాధ్యతపై స్ఫూర్తినిస్తుండగా, మరోవైపు ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు వారి బాధ్యతను గుర్తు చేసే మౌన సందేశంగా నిలిచిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. చిన్న సమస్యలను సకాలంలో పరిష్కరిస్తే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని వారు అభిప్రాయపడు తున్నారు .ప్రభుత్వం చేస్తేనే చేస్తాం అనే ధోరణికి భిన్నంగా, మన ఊరు మన బాధ్యత అనే భావనతో ముందుకొచ్చిన పాషా సేవాభావం గ్రామ ప్రజల మన్ననలు పొందుతోంది. ఇలాంటి యువకులు ప్రతి గ్రామంలో ముందుకు వస్తే సమాజంలో బాధ్యతాయుతమైన ఆలోచన పెరగడంతో పాటు గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం మరింత బలపడుతుందని స్థానికులు పేర్కొన్నారు. అయితే ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన రహదారి కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## రోడ్డు భద్రతపై పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం....

**సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: జులై 24( ప్రజా వీ క్షణం న్యూస్ )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజనగర్ మండలం వంజీరి గ్రామపంచాయతీ పరిధిలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడనమ్మకాల నిర్మూలనతో పాటు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని అవగాహన కల్పించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై డ్రంక్ డ్రైవింగ్‌కు వ్యతిరేకంగా కళాబృందం ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌత్రే లక్ష్మి, ఉప సర్పంచ్ భారత్, వార్డు సభ్యుడు రమేష్, గ్రామ ప్రజలు గోపాల్, బాబాజీ, తిరుపతి, మహిళలు లలిత, లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల భవిష్యత్తుకు మోడీ ప్రభుత్వం భరోసా..

**దేవరకద్ర జులై 24 ప్రజా విక్షణం**

విద్యార్థుల భవిష్యత్తుకు మోదీ ప్రభుత్వ భరోసా బిజెపి నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, హామీతో సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించారు. విద్యార్థుల ప్రయోజనాల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనం. ప్రభుత్వ ప్రధాన నిర్ణయాలు: శాంతియుత నిరసనకారులపై కేసులు నమోదు చేయకూడదనే అంశంపై సానుకూల స్పందన. పేపర్ లీకేజీల నివారణ, పరీక్షా విధానంలో విద్యా సంస్కరణలపై పార్లమెంటులో సమగ్ర చర్చకు హామీ. (నీట్ ) పేపర్ లీక్ కారణంగా నష్టపోయిన బాధితులకు తగిన పరిహారం చెల్లింపుపై సానుకూల పరిశీలన. భారతదేశ యువతే దేశ నిర్మాణానికి శక్తి. వారి భవిష్యత్తుకు వ్యతిరేకంగా పనిచేసే ప్రతి నేరస్థుడిపై ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కఠిన చర్యలు తథ్యం బిజెపి నాయకులు అన్నారు.

## పరిశుభ్రత పాటించి దోమలను నివారించాలి. సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్...

**సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: జులై 24( ప్రజా వీ క్షణం న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలం బొంబాయిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రగుంట గిరిజన గ్రామంలో డ్రై డే నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులను నివారించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త చప్పిడి ప్రకాశ్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు ఉండకుండా చూసుకోవడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని తెలపారు. గ్రామంలోని పాత టైర్లు, కూలర్లు, ట్యాంకుల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే ఖాళీ చేయించారు ప్రజల సహకారం ఉంటేనే గ్రామాన్ని ఆరోగ్యాకరంగా ఉంచుకోవడం సాధ్యమని, ప్రతి ఒక్కరూ పరిశుధ్యాంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి చుట్టూపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పద్మ, ఆశా వర్కర్ పద్మ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## రోడ్లు, విద్య, వైద్యం సహా మండల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

### అఖిలపక్ష జేఏసీ ఉద్యమ కార్యాచరణ సిద్ధం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష జేఏసీ రెండో సమావేశంలో ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు జేఏసీ చైర్మన్ మడావి గుణవంత్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు, రవాణా తదితర సమస్యలపై సమగ్రంగా చర్చించి, శాంతియుతంగా దశలవారీ ఉద్యమాలను చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ జేఏసీ రాజకీయ పార్టీలకు, కులాలకు అతీతంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువత, మేధావులు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో దీర్ఘకాలిక ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేఏసీ గౌరవ అధ్యక్షులు కుర్సెంగా మోతిరాం, జువ్వాజీ అనిల్ గౌడ్, కోశాధికారి బొమ్మగోని శంకర్, కో–కన్వీనర్లు వేడ్మా భగవంత్ రావు, మడావి నర్సింగ్ రావు, సలహాదారులు ఆడ తను, వేడ్మా నరేష్‌తో పాటు జేఏసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## బ్రహ్మోస్ కోసం భూముల సేకరణ.. ఆర్డిఓ నవీన్..

**దేవరకద్ర జులై 24 ప్రజా వీక్షణం**

దేవరకద్ర మండల పరిధిలోని చౌదర్పల్లి శివారులో బ్రహ్మోస్ క్షిపణి తయారు కేంద్రం కోసం భూముల సేకరణ చేస్తున్నట్లు ఆర్డీవో నవీన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులతో అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. దీనికోసము కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ఏర్పాటు కూడా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీని కోసము అధికారులు నాయకులు పూర్తిగా సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తాహ సిల్దార్ మహ్మద్ హర్షద్, ఉప తాసిల్దార్ దీపిక, ఆర్ ఐ లు శరత్ నాయక్, శశికళ, వివిధగ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



## జెన్కో కోల్ యాష్ ప్లాంట్ ప్రయివేట్ కాంట్రాక్టర్ టెండర్ నోటిఫికేషన్ రద్దు చేయాలని ధర్నా...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వై టి పి పి (యాదాద్రి థార్మల్ పవర్ ప్లాంట్ )జెన్కో కోల్ యాష్ ప్లాంట్ ప్రయివేట్ కాంట్రాక్టర్ కు అప్పగించేందుకు టెండర్ నోటిఫికేషన్ వేయడం జరిగింది వాటిని వెంటనే రద్దు చేయాలనీ,జెన్కో ప్రయివేటి కారణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పి ఆర్ సి కమిటీ ని వెంటనే వేయాలని భోజన విరామ సమయంలో బ్లాక్ రిబ్బన్ ధరించి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పవర్ జాక్ జిల్లా చైర్మన్ పి. వెంకటేష్, కన్వీనర్ ఎమ్మాజి సతీష్ నాయకులుశ్రీరాములు ,పిల్లి రామకృష్ణ, సుధారాణి, రమేష్, శ్రీధర్, తిరుపతి, రవీందర్ , భారతి,రాంచందర్,శేఖర్, మహేందర్ , సంపత్, సాయి, , లక్ష్మణ్, సుధ, రమ,లత, శకుంతల,ఇస్తారిబాయ్, రమాదేవి, సలీం, రమేష్, శేఖర్,ఉద్యోగులు పాల్గొన్నారు.



## బిట్స్ పిలానీలో సీటు సాధించిన ఇన్‌స్పైర్ విద్యార్థిని సాయి శ్రేష్ఠిత

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**




హనుమకొండ లోని ఇన్‌స్పైర్ జూనియర్ కళాశాల విద్యార్థిని తీగల సాయి శ్రేష్ఠిత దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలానీలో ప్రవేశం సాధించి కళాశాలకు గర్వ కారణంగా నిలిచింది. ఇంటర్మీ డియట్ పబ్లిక్ పరీక్షల్లో 997/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి న సాయి శ్రేష్ఠిత, తాజాగా బిట్స్ పిలానీలో సీటు దక్కించుకుని మరో ఘనత ను తన ఖాతాలో వేసుకుం ది. ఈ సందర్భంగా కళా శాల చైర్మన్ తీగల భరత్ గౌడ్, ప్రిన్సిపల్ సుంకరి శ్రీరామ్ రెడ్డి, డైరెక్టర్లు తీగల రాజ్‌కుమార్, కొటిచింతల మమత, లాడే శివ, అధ్యా పకులు, సిబ్బంది సాయి శ్రేష్ఠితను అభినందించారు. ఆమె తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషిని ప్రశం సిస్తూ, భవిష్యత్తులో మరి న్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించా రు. కళాశాల యాజమా న్యం మాట్లాడుతూ, నాణ్య మైన బోధన, అనుభవజ్ఞు లైన అధ్యాపకులు, క్రమ శిక్షణతో కూడిన విద్యా వాతావరణం వల్లే తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తున్నారని పేర్కొంది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు పంపిం చడమే తమ లక్ష్యమని వెల్లడించింది.

## తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు సందెల రాజు

### తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగా ణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సందెల రాజు జిల్లా ప్రజలకు హృద యపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి ఏకాదశి ఆధ్యాత్మిక చైతన్యం, భక్తి, ధర్మాచరణ కు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పవిత్ర పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, సమాజం లో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయు రారోగ్యాలు, సుఖసంతో షాలు, ఐశ్వర్యాలతో వర్ధి ల్లాలని కోరారు.



# భీమారంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)**



హసన్‌పర్తి మండలం భీమారం 55వ డివిజన్ కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకు లు మాట్లాడుతూ తెలంగా ణ అభివృద్ధికి కేటీఆర్ చేసిన సేవలను కొనియా డారు. ఆయన ఆయురా రోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో అటికం రవీందర్, సంగాల విక్టరీ బాబు, చింతల లక్ష్మణ్, రాయకంటి సురేష్, గుంజె సాయి కుమార్, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సంగాల సరోజన, గడ్డం భాగ్యలక్ష్మి తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్‌గా గులాం జావిద్ ఏకగ్రీవ ఎన్నిక.....

**సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: జులై 24 (ప్రజా వీ క్షణం న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా,రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సంక్షేమం మరియు వారి హక్కుల సాధన లక్ష్యంగా రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అనుబంధంగా తెలంగాణ వార్డ్ సభ్యుల ఫోరం నూతనంగా ఆవిర్భవించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేట కంట్రీ క్లబ్‌లో రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్, అధ్యక్షతన ఈ ఆవిర్భావ సభ వైభవంగా జరిగింది.
ఈ వేదికపై కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్‌గా గులాం జావిద్, ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ రాష్ట్ర కమిటీ అధికారికంగా ప్రకటించింది. గత నెల క్రితం ఆసిఫాబాద్ జిల్లా సభలో వార్డు సభ్యుల సమస్యలపై పోరాడేందుకు గులాం జావిద్ ని జిల్లా నాయకుడిగా ప్రకటించగా, నేడు బేగంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి వేదికపై రాష్ట్ర నాయకత్వం మరియు అన్ని జిల్లాల ప్రతినిధుల సమక్షంలో ఆయనను జిల్లా కన్వీనర్‌గా అధికారికంగా ఖరారు చేశారు.ముఖ్య నేతల సమక్షంలో ఎన్నిక ఈ ఆవిర్భావ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం జనరల్ సెక్రెటరీ మట్ట శ్రీనివాస్, ఉప అధ్యక్షురాలు కవిత, వార్డ్ సభ్యుల ఫోరం, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కనకమామిడి విష్ణు, రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సురేష్, పాల్గొని గులాం జావిద్, నియామక పత్రం మరియు శుభాకాంక్షలు అందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వార్డు సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఈ సమావేశానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు.



# స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా అభివృద్ధి అధికారి ప్రభాకరరావు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 24 ( ప్రజా వీక్షణం )**

స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా అభివృద్ధి అధికారి (డీడీఓ) ప్రభాకరరావు సూచించారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు (పీడీవోలు), ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) చంద్రశేఖరం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అభివృద్ధి అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, గ్రామ పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించే చర్యలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు తదితర అంశాలను ఆయన సవివరంగా వివరించారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రతను ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంలా చేపట్టాలని, అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) వి.చంద్రశేఖరం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తల్లాప్రగడ. రవిచంద్ర రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉప మండల అభివృద్ధి అధికారులు ఎంజెప్పిడి వెంకటేష్, వాణి, గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) సహాయ ఇంజనీర్ రాజా శ్రీనివాస్, పంచాయతీ అభివృద్ధి అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.




# కొయ్యలగూడెంలో వేడుకలా ‘పేరెంట్స్--టీచర్స్ మీటింగ్(పీటీ ఎమ్ 4.0)

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కలిసికట్టుగా అడుగులు వేయాలి: ఆకుల అరుణ కుమారి

**కొయ్యలగూడెం జులై 24(ప్రజా వీక్షణం):**

పిల్లల విద్యాభివృద్ధి మరియు వారి ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కలిసి పనిచేయడం ఎంతో అభినందనీయమని ఏలూరు పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ కుమారి అన్నారు. శుక్రవారం కొయ్యలగూడెం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన “పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (పిటీ ఎం 4.0)” కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో చాలా సేపు ఆత్మీయంగా ముచ్చటించారు. వారి చదువు, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుంటూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆకుల అరుణ కుమారి మాట్లాడుతూ.. విద్యార్థుల చదువు కేవలం బడికే పరిమితం కాకుండా ఇంట్లో కూడా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉన్నప్పుడే అనుకున్న మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ, వారి భవిష్యత్తుకు మరింత బలమైన పునాది వేయడమే ఈ పిటి ఎం 4.0 కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్మని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలకు సరైన మార్గదర్శకత్వం అందిస్తే వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: పీ టీ ఎమ్ 4.0 గ్రాండ్ సక్సెస్

**ఏపీగుంట జులై 24(ప్రజా వీక్షణం)**

ఏపీగుంట, శ్రీరామవరం బడుల్లో ఘనంగా ‘తల్లిదండ్రుల సమక్షం’ కూటమి నాయకులు, ఉపాధ్యాయుల పిలుపు టి. నర్సాపురం (ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘పేరెంట్-టీచర్ మీటింగ్’ కార్యక్రమం ఏపీగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని ఏపీగుంట, శ్రీరామవరం ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, “ప్రతి ఒక్క పిల్లాడు చదువుకోవాలి, బడి ఈడు ఉన్న ప్రతి ఒక్కరూ పాఠశాలకు రావాలి” అనే సంకల్పంతో ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. చదువుకుంటున్న ప్రతి విద్యా ర్థిని ప్రోత్సహించేందుకు ‘తల్లికి వందనం’ పథకం కింద తల్లి యొక్క బ్యాంక్ ఖాతాలో రూ. 13,000 జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. మన ఊరి పిల్లలను మన ఊరి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి నాణ్యమైన విద్యను అందించాలని పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కాల్నీడి రాంబాబు, కాల్నీడి వెంకటరత్నం, ఏపీగుంట పంచాయతీ టిడిపి అధ్యక్షులు సాధనాల బూసిబాబు, టి. నర్సాపురం మండల తెలుగు యువత అధ్యక్షులు కాల్నీడి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షులు ఈస్టిన వీరబాబు, సాయిల ప్రసాద్, బూత్ ఇంచార్జ్ కాల్నీడి కుమార్ రాజా, క్లస్టర్ ఇంచార్జ్ బచ్చుల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్ రమేష్ వర్మ, లవంకుల శ్రీరంగ వర ప్రసాద్, తాటికొండ వెంకటేశ్వరరావు, ఆదివాసీ నాయకులు పుసం అంజిబాబు, జనసేన నాయకులు కాల్నేడి నారాయణరావు, నాయుడు, చింతలపూడి . నవీన్, జబ్బా నాగరాజు, తాటి రాము, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్.ఎమ్.సి చైర్మన్, కూటమి శ్రేణులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

## జనసేన నాయకుడు చేపల రమేష్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 24 (ప్రజా వీక్షణం)**

విద్య తోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని జనసేన నాయకుడు చేపల రమేష్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ఎం. సత్య నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి చేపల రమేష్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, అప్పుడు ఇన్ని సదుపాయాలు లేవన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవతో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యా యులు, తల్లిదండ్రుల సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, పిల్లల్లో మంచి అలవాట్లు, నైతిక విలువలు, సమయపాలన పెంపొందించేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 29 మంది విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారని తెలిపారు. వారిలో ఇద్దరు విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ లో సీట్లు వచ్చాయని, ఎన్సీసీ విభాగంలో మరో ముగ్గురికి ట్రిబుల్ ఐటీ లో సీట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సీనియర్ విద్యార్థుల స్ఫూర్తితో జూనియర్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వివరించారు. ముందుగా విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, హాజరు, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, వసతి సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగం సుబ్బారావు, అత్తిలి బాబీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

## - శాశ్వత ప్రాతిపదికన పక్కాగా నిర్వహణ చేపట్టాలి - నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఎకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,జులై24( ప్రజా వీక్షణం):**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజీయాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి సూచించింది. పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో నివేదికలో తెలపాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు సూచించిన అన్ని అంశాలతో సమగ్రమైన తాజా అఫిడవిట్‌ను త్వరలోనే దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు. దానికి ధర్మాసనం ఆమోదం తెలిపింది. ఔఇఇ÷ వంటి అత్యంత కీలకమైన జాతీయ పరీక్షల్లో సంస్కరణల అమలును కోర్టు నిరంతరం పర్యవేక్షిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
25 శనివారం, జూలై 2026
9
www.prajaveekshanam.in

# కళ్లకు నల్ల గంతలతో కాంగ్రెస్ వినూత్న నిరసన

**కరీంనగర్, జూలై 24:**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ నగరంలోని మూడో డివిజన్ తీగలగుట్టపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కార్యకర్తలు కళ్లకు నల్ల గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మా ట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులపై దాడు లు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఇలాంటి ఘటనలను సహించబోమని హెచ్చరించారు. శాంతియుతంగా నిరస న తెలియజేయడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శిం చారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీల కారణం గా లక్షలాది







మంది విద్యార్థులు, వారి కుటుంబాలు నష్టపోయారని, ఈ ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఢిల్లీలో శాంతియుత నిరసనల్లో పాల్గొన్న యువతపై పోలీసుల చర్యలు, రాహుల్ గాంధీ అరెస్టును రాజేందర్‌రావు ఖండించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి వీధిలో శాంతియుత నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ మూడో డివిజన్ అధ్యక్షుడు మూల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పద్మాకర్ రెడ్డి, ఆర్శ మల్లేశం, కాశెట్టి శ్రీనివాస్, ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజన్న, దుగ్గ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి

### --- ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు అంబేద్కర్ యూత్ వినతి

**జీలుగుమిల్లి ( ప్రజా వీక్షణం - జూలై 24)**

జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు అంబేద్కర్ యూత్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పోలవరం నియోజకవర్గంలో గిరిజనులతో పాటు దళితులు కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని, తరతరాలుగా కలిసి జీవిస్తున్నప్పటికీ దళితులకు సరైన ప్రాథమిక సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో దళితులకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు ప్రైవేటు విద్యాసంస్థలపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీనివల్ల ముఖ్యంగా దళిత బాలికల చదువు తీవ్రంగా దెబ్బతింటోందని తెలిపారు. ఈ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడి, 3వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు బాలికలకు మండల కేంద్రంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దళిత బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ఈ హాస్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ తలారి సతీష్, అంబేద్కర్ యూత్ నాయకులు బొంతు రామకృష్ణ, సిరిశెట్టి రాఘవులు, చాపల లక్ష్మణ్, జెట్టి రామకృష్ణ, నక్క రవి, బట్టు సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల విశ్వాసమే పోలీసుల బలం..






### మర్యాదపూర్వక సేవలతో న్యాయం అందించాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

### తాండూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీ..

### పోక్సో కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా, ఆధునిక సాంకేతికత వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం

**తాండూర్: ప్రజా వీక్షణం**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ దేవయ్యలు పుష్పగుచ్ఛం అందించి కమిషనర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించిన కమిషనర్ కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి, పెండింగ్ ట్రయల్ కేసుల సీడీ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్, ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత తో పాటు వేగం కూడా ఉండాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను తరచుగా తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును సమీక్షించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా మార్గనిర్దేశం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. భూ వివాదాలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును పూర్తిస్థాయిలో విచారించి, చట్టబద్ధంగా పరిష్కరించాలని, ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ఆదేశించా రు. ప్రజలతో వ్యవహరించే సమయంలో ఓర్పు, వినయం, మర్యాద అత్యంత ము ఖ్యమని పేర్కొన్న కమిషనర్, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషనర్‌ను గౌరవ ంగా పలకరించి వారి సమస్యలను శ్రద్ధ గా విని, చట్ట పరిధిలో సాధ్యమైనంత సహాయం అందించాలని సూచించారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే సిబ్బంది ప్రవర్తనే కీలకమని ఆయన అన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా రాత్రి వేళల్లో ప్రివెంటివ్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే గుర్తించి నివారించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి సీసీటీఎన్ఎస్, సమాచార సాంకేతికత ఐటీ, డిజిటల్ దర్యాప్తు విధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రమోషన్లతో బాధ్యతలు పెరుగుతున్నందున సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ప్రజలకు చట్టబద్ధంగా, నిష్పాక్షికంగా న్యాయం చేయడం ప్రతి పోలీసు అధికారి ప్రథమ కర్తవ్యం. మర్యాదపూర్వక సేవలు, పారదర్శక దర్యాప్తు, సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారానే ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయగలం అని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ స్పష్టం చేశారు.

# వీరభద్రవరంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ

### సామాజిక సేవే ధ్యేయం: టిడిపి నాయకులు శీలం వెంకటేశ్వరరావు

**టి.నర్సాపురం (వెలగపాడు): జులై 24(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా, టి.నర్సాపురం మండలం, వెలగపాడు పంచాయతీ పరిధిలోని వీరభద్రవరం గ్రామంలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచితంగా కళ్ళజోళ్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. టిడిపి సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయి వినయ్ ముఖ్య అతిథులుగా హాజరై బాధితులకు స్వయంగా కళ్ళజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలకు దూరంగా ఉన్న పేదలకు సహాయపడటమే ధ్యేయంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. శీలం వెంకటేశ్వరరావు, సాయి వినయ్ లతో పాటు ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ ప్రెసిడెంట్ జోనుబోయిన భాషా, నాయకులు రాచగొర్ల లక్ష్మయ్య, పదిలం శ్రీను, తట్టుకోళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమ కంటి సమస్యలను గుర్తించి ఉచితంగా కళ్ళజోళ్లు అందించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



# విజయవంతంగా విద్యాసంస్థలు బంద్:(ఎన్ ఎస్ యు ఐ)

**రామడుగు: ప్రజా వీక్షణం**

దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న (నీట్) పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలు పేపర్ లీక్ ఆరోపణలు విద్యార్థుల న్యాయమైన ఆందోళనలపై ఢిల్లీలో జరిగిన పోలీసు చర్యలకు నిరసనగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026 జూలై 24న నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా రామడుగు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ (ఎన్ఎస్ యూఐ) ఆధ్వర్యంలో అన్ని విద్యాసంస్థలను విజయవంతంగా శుక్రవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షులు అనుపురం పరుశురాం గౌడ్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన ఆందోళనలను అణచివేయడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా (ఎన్ ఎస్ యుఐ) రామడుగు మండల అధ్యక్షులు జవ్వాజి అజయ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ కావడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతున్నారని జవ్వాజి అజయ్ మండిపడ్డారు. వారి ప్రధాన డిమాండ్లు నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూకేం ద్రవిద్యాశ ఖ మంత్రిరాజీనామాచేయాలి లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి పారదర్శకంగా మళ్లీ పరీక్ష నిర్వహించాలి విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్ కుమార్ చొప్పదండి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చొప్పదండి అనిల్ కుమార్ యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మల్యాల అక్షయ్ కుమార్ సిరికొండ సాయి తేజ నాయకులు బబ్లు శ్రావణ్ రాకేష్ రాహుల్ శేఖర్ అజయ్ శివ తదితరులు పాల్గొన్నారు.






# రహదారిపై విరిగిపడ్డ కొండచరియలు

### కారుమీద పడడంతో 13 మంది దుర్మరణం

**సిమ్లా,జూలై24( ప్రజా వీక్షణం ):**

హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లా గిరిజన ప్రాంతం పాంగిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కిలాడ్–ఉదయ్‌పూర్ రహదారిపై కదు నాలా సమీపంలో వెళ్తున్న టాటా సుమో వాహనంపై అకస్మాత్తుగా కొండ చరియలు విరిగిపడ్డాయి. భారీగా మట్టితో వాహనం పూర్తిగా కూరుకుపోవడంతో అక్కడికక్కడే 13 మంది మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు భర్మోర్–పాంగా ఎమ్మెల్యే డాక్టర్ జనక్ రాజ్ ధ్రువీకరించారు. ఘటన అనంతరం జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాల నేపథ్యంలో పర్వత ప్రాంతాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

## వరంగల్‌లో ఆయుష్ సేవల అభివృద్ధిపై లోక్ సభలో ఎంపీ కడియం కావ్య ప్రశ్న

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)



వరంగల్ జిల్లాలో ఆయుష్ వైద్య సేవల అభివృద్ధిపై వరంగల్ ఎంపీ డా. కడి యం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, జాతీయ ఆయుష్ మిషన్ కింద 9 ఆయుష్మా న్ ఆరోగ్య కేంద్రాల అభివృ ద్ధి, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో అదనపు బ్లాక్ నిర్మాణం, మందుల సరఫ రాకు కేంద్రం నిధులు మం జూరు చేసినట్లు తెలిపారు. గత మూడు ఆర్థిక సంవ త్సరాల్లో రూ.56.16 లక్ష లు, రూ.24.32 లక్షలు, రూ.3.23 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భం గా ఎంపీ కడియం కావ్య, జిల్లాలో ఆయుష్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరిం త విస్తరించాలని కేంద్రాన్ని కోరారు.

## నిక్షయ్ మిత్రల సహకారంతో టీబీ రోగులకు పోషకాహార కిట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)

టీబీ ముక్త్ భారత్ అభి యాన్--2.0లో భాగంగా నిక్షయ్ మిత్రల సహకారం తో క్షయవ్యాధి చికిత్స పొందుతున్న రోగులకు పోషకాహార కిట్లు అందిం చాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధి కారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, బ్యాంకుల సి ఎస్ ఆర్ నిధులను సమీ కరించి నిక్షయ్ మిత్రల భాగ స్వామ్యాన్ని పెంచాలని సూచించారు. అర్హులైన టీబీ రోగులకు చికిత్స కాలమంతా నిరంతరంగా ఫుడ్ బాస్కెట్ కిట్లు అందే లా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలి పారు. సమావేశంలో డీఎం హెచ్‌వో డా. అప్పయ్య రాష్ట్ర నిక్షయ్ మిత్ర ప్రోగ్రామ్ అధికారి వేము కుమార్ కారంపూడి, ఇన్‌చార్జ్ జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా ఎల్తూరి సురేష్ నియామకం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా కార్యదర్శిగా ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన ఎల్తూరి సురేష్ ను రాష్ట్ర అధ్యక్షు డు ఓరుగంటి ఆనంద్ నియమించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్య క్షుడు భాషబోయిన రవీందర్ యాదవ్ నియామక పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా భాషబోయిన రవీందర్ యాదవ్ మాట్లా డుతూ, తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షల సాధన, రాష్ట్ర అభివృద్ధి, ఆత్మగౌరవం, సంక్షేమం కోసం సంస్థ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల ని ఎల్టూరి సురేష్ కు సూచించారు. సంస్థ తనపై ఉంచిన నమ్మకాన్ని నిల బెట్టుకుని బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

## ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలి

### ఆగస్టు 30లోగా యూనిఫాంల పంపిణీ పూర్తి చేయాలి

### సీఎస్ సంజయ్ జాజు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)

సూపర్ ఎల్‌నినో పరిస్థితు ల నేపథ్యంలో తక్కువ నీటి వినియోగంతో సాగ య్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాల ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ, రెసిడెన్షి యల్ పాఠశాలల విద్యార్థు లకు ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలను అంద జేయాలని సూచించారు. జూలై 27--29 వరకు రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలను విజయవంతం చేసి రైతులకు ప్రత్యామ్నా య పంటలపై అవగాహన కల్పించాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనం తరం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులతో సమీ క్ష నిర్వహించి, వరి--పత్తికి బదులుగా పప్పుధాన్యాలు చిరుధాన్యాల సాగుపై రైతులకు ప్రచారం చేపట్టా లని, యూనిఫాంల పంపిణీ నిర్ణీత గడువులోగా నాణ్య తతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించా రు.






## వాంకిడి,బంబర ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఆకస్మిక తనిఖీ





ప్రజా వీక్షణం ,ఆసిఫాబాద్,24 జూలై 2026:

కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి,బంబర ఆశ్రమ ఉన్నత పాఠశా లలను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (DTWO) జాదవ్ అంబాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భ ంగా పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థుల హాజరు, తరగతి గదుల బోధన, వసతి గృహ నిర్వహణ, భోజన శాల, వంటశా ల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపా యాలు, భద్రతా చర్యలను క్షుణ్ణం గా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆహారం నాణ్యత, వసతి సౌకర్యాలు, ఎదురవు తున్న సమస్యల గురించి అడిగి తెలుసు కున్నా రు.పాఠ శాలలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకా హారం అందేలా అధికా రులు, ఉపాధ్యా యులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల ని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థి నుల ఆరోగ్య ం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వా లని ఆదేశిం చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విద్యా ర్థులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులకు సూచించా రు.ఈ ఆకస్మిక తనిఖీతో పాఠ శాల నిర్వహణపై మరింత బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ స్పష్ట ం చేశారు. ఈ సందర్భంగా బంబర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బెడ్ షీట్లు, టవల్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశా రు.ఈ కార్యక్రమంలో పీఎంఆర్సీ, ఏసీ ఎంఓ పూర్కా ఉద్దవ్, వాంకిడి, భంబారా పాఠశాలల ప్రధానోపా ధ్యా యులు మాడుగుల నారాయణ మూర్తి, డి.లక్ష్మీప్ర సన్న, వార్డెన్ మంగవ తి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నా రు. ఈ



సందర్భంగా పాఠశాల సిబ్బంది జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ శాలువాతో సన్మానించారు.

## ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

### ఆషాఢ సారె సమర్పించేందుకు మహిళల రాక - భారీగా ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

విజయవాడ,జూలై24( ప్రజా వీక్షణం ):

ఆషాఢ మాసం, శుక్రవారం, సారె ఉత్సవాలు ఒకేసారి కలిసి రావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రంగా మారింది. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన శు క్రవారం కావడంతో తెల్లవారుజాము నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి శ్రీ కనకదుర్గమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ముఖ్యంగా అమ్మవారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, సారెలతో మహిళలు పెద్దఎత్తున ఇంద్రకీలాద్రికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. అలాగే ప్రోటోకాల్, వీఐపీ బ్రేక్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి, క్యూలైన్లు వేగంగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. ఏసీ రంగారావు పర్యవేక్షణలో భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం పూర్తిచేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆషాఢ సారె ఉత్సవాల 10వ రోజైన శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 42 సారె బృందాల ద్వారా 16,890 మంది మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనా నాయక్ స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి సంతృప్తి స్థాయిని తెలుసుకున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి శుక్రవారం వరకు 1,94,030 మంది మహిళలు శ్రీ కనకదుర్గమ్మవారికి సారె సమర్పించినట్లు ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు.

## అల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలు ప్రారంభం

కరీంనగర్ జూలై 24( ప్రజా వీక్షణం )

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తనాజీ వకాడే, అసిస్టెంట్ కలెక్టర్ పి. హరిప్రసాద్, సీబీఎస్ఈ రీజనల్ ఆఫీసర్ జే. సునీల్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొలిరోజు అండర్--14, అండర్--17 విభాగాల్లో పలు మ్యాచ్‌లు జరిగాయి. అండర్--14లో జ్యోతి విద్యాలయం, వాసవి పీఎస్, లిటిల్ స్కాలర్స్ విజయం సాధించగా, అండర్--17లో శ్లోక బిర్లా స్కూల్, సంఘమిత్ర స్కూల్, సెయింట్ ఆంథ్రూవ్స్ స్కూల్ జట్లు గెలుపొందాయి.



## కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 24 (ప్రజా వీక్షణం న్యూస్)

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50 వ జన్మదినాన్ని పురస్కరిం చుకుని హసన్‌పర్తి మండ ల బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ బండి రజని కుమార్ ఆధ్వర్యంలో అతిథి మాన సిక వికలాంగుల ఆశ్రమం లో అన్నదానం, పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి రజని కుమార్ మాట్లాడు తూ, కేటీఆర్ పిలుపు మేర కు "గిఫ్ట్ ఎ స్మైల్" కార్య క్రమంలో భాగంగా కేకులు, ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేయకుండా అవసరమైన వారికి సహాయం చేయాల నే ఉద్దేశంతో ఆశ్రమంలోని మానసిక వికలాంగులకు ఒకపూట భోజనంఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపిశెట్టి శ్రీధర్, కొత్తకొండ సుభాష్ గౌడ్, నద్దునూరి నాగరాజు, పాడి మల్లారెడ్డి, సూరం వాసుదేవరెడ్డి, పోలేపల్లి (మైకేల్) రాజు, మొట్టే అరు ణ్, చాతాల్లా వేణుగోపాల్, రాజు నాయక్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాపక్షం దినపత్రిక
SPORTS/ BUSINESS
25 శనివారం, జులై 2026
www.prajaveekshanam.in

# పారా స్విమ్మింగ్ ఫైనల్లో కార్తిక్, ఇమామ్.. 90 కిలోలపై సందిగ్ధంలో ఒలింపిక్ విజేత..!

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ లో భారత స్విమ్మర్లు అదరగొడుతున్నారు. పురుషుల పారా 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ ఎస్ 13 విభాగంలో కార్తిక్ బుడిగిన అలీ ఇమామ్‌లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో సత్తా చాటిన శ్రీహరి నటరాజ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. అయితే.. వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను మూడోసారి పసిడి పట్టేస్తుందనుంటే.. 90 కిలోల విభాగంలో 100 శాతం తన సామర్థ్యాన్ని వినియోగించలేనని పేర్కొంది.తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడుతున్న కార్తిక్ బుడిగిన, అలీ ఇమామ్‌లో ఈత కొలనులో మెరిశారు. చూపు సరిగా లేని ఇద్దరూ పారా స్విమ్మింగ్ పోటీల్లో ఫైనల్ చేరి పతకానికి అడుగుదూరంలో నిలిచారు. కార్తిక్ 57.10 సెకన్లలో స్విమ్ పూర్తి చేసి మూడో స్థానంలో నిలవగా.. ఎస్ 12 ఈవెంట్లో 1:05.32 టైమింగ్‌తో అలీ ఫైనల్ బెర్తు సాధించాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో ఫైనల్ బెర్తు కోసంశ్రీహరి నటరాజ్ శనివారం ఉదయం 12:30గంటలకు ఈతకు సిద్ధమవ్వనున్నాడు.భారత కే ఆర.వీ.వీ.బీ.కే. బుడిగినా ఔర అలీ ఇమామ నే పురుషోం కీ ఏస13 100 మీటర ఫ్రీస్టాఇల కీ పహలీ హీట మేం క్రమశః 57.10 సేకండ ఔర 1:05.32 మినట కా సమయ దర్జ కియా। మీరాబాయి డౌటే ఒలింపిక్ విజేత మీరాబాయి చాను మాత్రం తాను 90 కిలోల విభాగంలో పూర్తి స్థాయిలో పోటీపడనని తేల్చి చెప్పింది. జపాన్ వేదికగా త్వరలో జరుగబోయే ఆసియా క్రీడలే లక్ష్యంగా పెట్టుకున్న తాను కామన్వెల్త్‌లో 100 శాతం తన శక్తిని ఉపయోగించబోనని స్పష్టం చేసిందీ పవర్ లిఫ్టర్. ఎందుకంటే.. గ్లాస్గోలో తను 48 కిలోల విభాగంలో తలపడుతోంది. ఆసియా క్రీడల్లో 49 కిలోల కేటగిరీలో బరువులు ఎత్తాలనుకుంటున్న చాను కామన్వెల్త్ పోటీల్లో అనవసరంగా రిస్క్ వద్దనే ఉద్దేశంతో ఉంది.




# మళ్లీ ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్‌గా జో రూట్!

అంతర్జాతీయ క్రికెట్ నుంచి బెన్ స్టోక్స్ అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడంతో ఇంగ్లాండ్ టెస్టు జట్టుకు కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. ఈ సమయంలో టెస్ట్ జట్టు డిప్యూటీగా, వన్డే, టీ20 జట్టు కెప్టెన్‌గా ఉన్న హ్యారీ బ్రూక్ వైపే ఈసీబీ మొగ్గుచూపుతుందని అంతా భావించారు. అతడికే టెస్ట్ కెప్టెన్సీ ఇస్తుందని అంచనా వేశారు. కానీ ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు అందుకు సిద్ధంగా లేదని సమాచారం. సీనియర్ ప్లేయర్ జో రూట్‌కు టెస్ట్ కెప్టెన్సీ అప్పగించాలని ఈసీబీ భావిస్తోందట.వచ్చే ఏడాది స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ వరకు జో రూటే ఇంగ్లాండ్ టెస్ట్ జట్టును నడిపించే అవకాశం ఉందని 'ది అథ్లెటిక్' నివేదించింది. ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్ నుంచి రూట్ కెప్టెన్సీ ప్రయాణం మళ్లీ మొదలుకానున్నట్లు సమాచారం. ఇంగ్లాండ్ వైట్ బాల్ జట్ల కెప్టెన్‌గా ఉన్న హ్యారీ బ్రూక్ రాబోయే వన్డే ప్రపంచకప్ కోసం దృష్టి పెట్టాలని బోర్డు భావిస్తోంది. దీంతో టెస్టు జట్టు బాధ్యతలను అనుభవజ్ఞుడైన జో రూట్‌కే అప్పగించాలని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిర్ణయానికి వచ్చిందట. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లో ఎదురైన ఓటమి తర్వాత ఇంగ్లాండ్ మేనేజ్‌మెంట్ జట్టులో పలు మార్పులు చేస్తోంది. ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను టెస్టు కోచ్ నుంచి తప్పుకున్నాడు. టెస్ట్ జట్టు తాత్కాలిక కోచ్‌గా మార్కస్ ట్రెస్కోథిక్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కాగా జో రూట్ గతంలోనూ ఇంగ్లాండ్ కెప్టెన్‌గా ఉన్నాడు. 2017 నుంచి 2022 వరకు ఇంగ్లాండ్ జట్టును నడిపించాడు. మొత్తం 64 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించి 27 విజయాలను అందించాడు. అయితే 2022లో ఆ జట్టు ఆడిన 17 టెస్టుల్లో కేవలం ఒకే ఒక్క విజయం సాధించడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొని రూట్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అయితే ప్రస్తుత క్లిష్ట సమయంలో జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడానికి ఇంగ్లాండ్ జట్టులో కెప్టెన్సీకి రూట్ కంటే మెరుగైన ప్రత్యామ్నాయం మరొకటి లేదని బోర్డు భావిస్తోందట.




# లక్ష్మణ్ జట్టును నడిపించిన తీరు అమోఘం

## - లక్ష్మణ్ హెడ్ కోచ్‌గా కొనసాగించాలి - డిమాండ్ చేస్తున్న ఇండియా ఫ్యాన్స్

జింబాబ్వే పర్యటనలో శుభారంభం చేసిన టీమిండియా.. తమ వరుస పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. పసికూన ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో సిరీస్‌ల్లో క్లీన్ స్వీప్ అయిన భారత్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. వరుసగా 7 మ్యాచ్‌ల్లో ఒక్క విజయం సాధించలేకపోయిన భారత్.. జింబాబ్వే పర్యటనలో ఊరట విజయాన్ని అందుకుంది.మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం హరారే వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు ఇదే తొలి విజయం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో టీమిండియా అదరగొట్టింది. బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ అద్వితీయమైన ప్రదర్శన కనబర్చగా.. బ్యాటింగ్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. అయితే ఈ పర్యటనకు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండగా.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. అతని సపోర్ట్ స్టాఫ్ కూడా టీమిండియాకు సేవలందిస్తుంది. గంభీర్‌తో పాటు అతని సపోర్ట్ స్టాఫ్‌కు ఈ పర్యటనను విశ్రాంతి కల్పించారు.వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో టీమిండియా తొలి విజయం సాధించడంతో ఆయననే హెడ్ కోచ్‌గా కొనసాగించాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. జింబాబ్వేతో మ్యాచ్‌లో భారత బౌలింగ్ బాగుందని, అనుభవం లేని బౌలర్లతో లక్ష్మణ్ జట్టును నడిపించిన తీరు అమోఘమని కొనియాడుతున్నారు. కనీసం టీ20 ఫార్మాట్‌లోనైనా లక్ష్మణ్‌ను కోచ్‌గా కొనసాగించాలని బీసీసీఐని కోరుతున్నారు. టీమ్ ప్లానింగ్ అద్భుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులే చేసింది. వెస్లీ మధెవెరే(34 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 39), తడివానషే మరుమాని(20 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 27 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్(2/18), ప్రిన్స్ యాదవ్(2/16) రెండేసి వికెట్లు తీయగా.. శివమ్ దూబే, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లకు 126 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ(19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 50) విధ్వంసకర హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇషాన్ కిషన్(24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 35), శ్రేయస్ అయ్యర్(24 బంతుల్లో 3 ఫోర్లతో 28 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజర్బానీ రెండు వికెట్లు తీయగా.. రిచర్డ్ నగర్వా ఒక వికెట్ పడగొట్టాడు.




# ఏషియన్ గేమ్స్ క్వార్టర్స్‌కు భారత జట్లు

జపాన్‌లో సెప్టెంబరు 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఏషియన్ గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్ రౌండ్?కు అర్హత సాధించాయి. ఈ పోటీల్లో క్రికెట్ మ్యాచ్‌లను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. 2023లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్‌లుగా ఈ ఈవెంట్‌లో బరిలోకి దిగబోతున్నాయి. పురుషుల విభాగంలో భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక టాప్ సీడ్ జట్లుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో మిగిలిన 4 క్వార్టర్ ఫైనల్స్ బెర్తుల కోసం మొత్తంగా 6 జట్లు పోటీ పడుతున్నాయి. గ్రూప్-ఏలో అఫ్గనిస్థాన్, జపాన్, నేపాల్.. గ్రూప్-బీలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ ఉన్నాయి. ప్రతి గ్రూప్‌లో తొలి 2 స్థానాల్లో నిలిచిన జట్లు టాప్-8కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబర్ 28న భారత్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. అక్టోబర్ 1న సెమీ ఫైనల్స్, 3న కాంస్య పతక మ్యాచ్ జరగనుంది. ఇక అదే రోజు గోల్డ్ మెడల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మరోవైపు మహిళల విభాగంలో 8 జట్లకు డైరెక్ట్ నాకౌట్ విధానంలో సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు మ్యాచ్‌లు జరుగుతాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌తో భారత్, బంగ్లాదేశ్‌తో చైనా, శ్రీలంకతో మలేషియా, పాకిస్థాన్‌తో థాయ్‌లాండ్ తలపడనున్నాయి.

**ఏషియన్ గేమ్స్‌కు భారత పురుషుల జట్టు..**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, జస్‌ప్రీత్ బుమ్రా, సంజు శాంసన్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్షదీప్ సింగ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ

**ఏషియన్ గేమ్స్‌కు భారత మహిళల జట్టు:**

హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి. కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, నందిని శర్మ, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్

# మయాంక్ యాదవ్ అద్వితీయమైన బౌలింగ్

మయాంక్ ప్రదర్శనతోనే విజయం సాధించాం టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మయాంక్ యాదవ్ అద్వితీయమైన బౌలింగ్ ప్రదర్శనతోనే జింబాబ్వేతో తొలి టీ20లో విజయం సాధించామని టీమిండియా టీ20 కెప్టెన్



శ్రేయస్ అయ్యర్ అన్నాడు. మయాంక్ అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో విజయానికి ప్లాట్‌ఫామ్ సెట్ చేశాడని, ఆ తర్వాత వైభవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో పనిని పూర్తి చేశాడని పేర్కొన్నాడు. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా హరారే వేదికగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. కెప్టెన్‌గా తొలి విజయం సాధించడం సంతోషంగా ఉందని చెప్పాడు. 'కెప్టెన్‌గా తొలి విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఇంతకంటే ఆనందమైన విషయం మరొకటి లేదు. మా ఆటగాళ్లు ప్రణాళికలను అమలు చేసిన తీరు చాలా బాగుంది. ముందే చెప్పినట్లుగా పిచ్‌లో బౌన్స్ ఉంది. ముఖ్యంగా హార్డ్ లెంగ్త్ నుంచి మంచి బౌన్స్ లభించింది. మ్యాచ్ ప్రారంభంలో బౌన్స్‌లో వైవిధ్యం కూడా కనిపించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పిచ్ తీరు దాదాపు ఒకేలా ఉంది. కానీ మయాంక్ యాదవ్ మాకు అద్భుతమైన ఆరంభాన్ని అందించాడు. అతను తన లెంగ్త్‌ను నియంత్రిస్తూ.. ప్రత్యర్థి బ్యాటర్లకు పరుగులు తీసే అవకాశం ఇవ్వకుండా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత పవర్ ప్లేలో వైభవ్ సూర్యవంశీ వచ్చి మాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. జింబాబ్వేను ఆలౌట్ చేయాలని అనుకోలేదు. ఏ జట్టులోనైనా సరే.. ఇన్నింగ్స్‌ను చివరి వరకు తీసుకెళ్లి గౌరవప్రదమైన స్కోర్ అందించే బ్యాటర్ ఒకరు ఉంటారు. వాళ్లు పిచ్ పరిస్థితులను బాగా అర్థం చేసుకొని, భాగస్వామ్యాలు నెలకొల్పడం ప్రారంభించారు. నేను మాత్రం బౌలర్లందర్నీ రొటేట్ చేశాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడాలని భావించాను.వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. అతను ఫియర్‌లెస్ యంగ్ బ్యాటర్. అతను ఆడిన విధానం అసాధారణం. అతనికి ఇక్కడ ఆడిన అనుభవం ఉంది. ఇక్కడి పిచ్‌లపై మంచి అవగాహన ఉంది. అండర్ 19 ఫైనల్లో అతను 175 పరుగులు చేశాడనుకుంటా. అందుకే మైదానంలోకి అడుగుపెట్టగానే అతనిలో అపారమైన ఆత్మవిశ్వాసం కనిపించింది.

ప్రజావీక్షణం దినపత్రిక

## రణబలి విడుదలపై అయోమయం

దసరా లేదా దీపావళికి తీసుకువచ్చే యత్నం కథానాయకుడు విజయ్ దేవరకొండ.. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఇప్పుడిది ఆ తేదీకి రాకపోవచ్చనే సంకేతాలందుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాని దసరా లేదా దీపావళి బరిలో దించేందుకు చిత్ర నిర్మాతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చిరంజీవి 'విశ్వంభర' దసరాకి రానట్లయితే అక్టోబరు 16న దీన్ని తెరపైకి తీసుకురావాలని.. లేదంటే దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇది 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ - అతుల్ సంగీతమందిస్తున్నారు.




## అమెరికా ప్రచారంలో రామాయణ టీమ్




దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోన్న పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' గ్లోబల్ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. అమెరికాలో జరుగుతోన్న ప్రముఖ శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్ర బృందం పాల్గొని సందడి చేసింది. రణ్‌బీర్ కపూర్, యశ్, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు నిర్మాత నమిత్ మల్హోత్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్‌పై యశ్ ప్రశంసలు కురిపించారు.'రాముడి పాత్ర పోషించడం చాలా కష్టం. రణ్‌బీర్ కపూర్ గొప్పగా నటించాడు. ఈ పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా చూసినప్పుడు అతడి నిబద్ధత కనిపిస్తుంది. ఇలాంటి సినిమాను చిత్రీకరించాలంటే సంకల్ప బలం ఉండాలి. మంచి టీమ్ ఉన్నప్పుడు ప్రతీది కలిసి వస్తుంది. ఈ సినిమా ప్రారంభించాక జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాం. మేకప్ నుంచి లుక్స్ వరకూ సాంకేతికంగా ఇది ఎంతో సవాలుతో కూడుకున్న పని. మా శక్తివంచన లేకుండా కృషి చేశాం' అని యశ్ అన్నారు. ఈ సినిమా ట్రైలర్ నేడు విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని టీమ్ భావిస్తోంది. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు.



## జననాయగన్ ఓపెనింగ్స్ అంతంతమాత్రమే

### జి 5 ఓటిటి హక్కులు పొందినట్లు ప్రచారం

తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' ఎట్టకేలకు జూలై 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. రిలీజ్‌కి ముందు ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే మూవీ విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఓపెనింగ్స్ రాకపోయినా, ఇప్పుడు సినిమా ఓటీటీ హక్కుల వ్యవహారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దళపతి వెట్రి కొండన్ పాత్రలో కనిపించారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, ప్రియమణి, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. సినిమాలో విజయ్ మాస్ ఎలివేషన్స్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకున్నప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం, కొన్ని సన్నివేశాలు సాగదీతగా ఉండటంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. సినిమా విడుదలకు ముందే అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సుమారు రూ.110 కోట్లకు సొంతం చేసుకునే దిశగా చర్చలు జరిపినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపించాయి. అయితే విడుదల ఆలస్యం, ఇతర కారణాలతో ఆ ఒప్పందం చివరికి కుదరలేదని సమాచారం. ఆ తర్వాత ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా హక్కులను సుమారు రూ.50 కోట్లకు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో దాదాపు రూ.60 కోట్ల తేడాతో ఓటీటీ భాగస్వామి మారిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆగస్టు 21 నుంచి 'జన నాయగన్' జీ5లో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమా అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. విజయ్ సినీ జీవితానికి ముగింపు పలికిన ఈ చిత్రాన్ని థియేటర్లలో చూడాలని అభిమానులు భావిస్తుండగా, ఓటీటీ విడుదల కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే డిజిటల్ రిలీజ్, హక్కుల వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## మరో డిఫరెంట్ ప్రేమకథ.. చెన్నై లవ్ స్టోరీ

కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచించింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం? ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిందన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ. ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదాసులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్ధంలో దర్శకుడు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే? ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందరగోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది. స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయకత్వం, చలాకీతనం సహజంగా ఉంటాయి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికించాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందాగా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి. విశ్వాస్ డేనియల్ ఛాయాగ్రహణం, చెన్నై వాతారవణం, వర్షం, కొన్ని క్లాసిక్ సినిమాలని గుర్తు చేసే ఫ్రేమ్స్, ఉన్నతమైన నిర్మాణ విలువలు సినిమాకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.



## మంగళవారం మూవీకి సీక్వెల్

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం'తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.'మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' పనుల్లో పూర్తిగా బిజీగా ఉన్నానని, ఆ సినిమా విడుదలైన తర్వాత పూర్తిస్థాయిలో 'మంగళవారం 2' స్క్రిప్ట్‌పై దృష్టి పెడతానని తెలిపారు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'మంగళవారం 2' కథను అజయ్ భూపతి దర్శకుడు కొరటాల శివకు వినిపించినట్లు తెలుస్తోంది. కథ నచ్చడంతో ఆయన తన నిర్మాణ సంస్థ యువసుధా ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అజయ్ భూపతి తాజా వ్యాఖ్యలతో 'మంగళవారం 2' టాలీవుడ్‌లో ఇప్పటి నుంచే హాట్ టాపిక్‌గా మారింది. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com